www.visalaandhra.com

శుక్రవారం
07-06-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 346
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

సతీశ్‌రెడ్డికి ఎస్ఎస్ఎంఈ గౌరవ సభ్యత్వం

న్యూదిల్లీ: డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్ రెడ్డికి స్పేస్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఎస్ఎస్ఎంఈ) జీవితకాల సభ్యత్వం లభించింది. ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీలోవిశేష కృషికి గుర్తింపుగా ఆయనను సన్మానించారు.

గుజరాత్, అహ్మదాబాద్‌లోని ఇస్రో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ఎస్. సోమనాథ్, ఎస్ఏసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ డీకేసింగ్ సమక్షంలో రక్షణ మంత్రి మాజీ శాస్త్రీయ సలహాదారు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్ రెడ్డికి గౌరవ సభ్యత్వం ప్రదానం చేశారు.

టీచర్ల బదిలీలకు బ్రేక్

- భారీగా చేతి వాటం?
- 1,400 మంది ఎక్కడి వారు అక్కడే
- పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు
- కొత్త ప్రభుత్వం రాకముందే షాక్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో టీచర్ల బదిలీలకు బ్రేక్ పడింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను అధికారులు నిలుపుదల చేశారు. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఎలాంటి బదిలీలు చేయవద్దంటూ అన్ని జిల్లాల డీఈవోలను ఆయన ఆదేశించారు. దీంతో 1400 మంది బదిలీల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోనుంది. కొత్తప్రభుత్వం రాకముందే ఈ తరహాగా ఉత్తర్వులు రావడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు కలవరం చెందుతున్నారు. ఎన్నికల ముందు 1,400 మంది టీచర్లను బదిలీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు బదిలీలకు ఆదేశాలిచ్చారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున లావాదేవీలు జరిగినట్లు సమాచారం. వారికి ఏప్రిల్ 24న బదిలీల ఉత్తర్వులు ఆయా జిల్లాల డీఈవోల ద్వారా అందాయి. తక్షణమే రిలీవ్ కావాలని ఆదేశించారు. ఉత్తర్వులతో ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా, ఈలోగా ఎలక్షన్ కోడ్ వచ్చింది. కోడ్ ముగిశాక రిలీవ్

- మిగతా 2 లో

చర్యలు షురూ!

- ఐఏఎస్, ఐపీఎస్‌ల్లో కలకలం
- సెలవుపై సీఎస్ జవహర్‌రెడ్డి
- అదేబాటలో మరికొందరు ఉన్నతాధికారులు
- బాబును కలిసేందుకు ఆ ముగ్గురికీ 'నో ఎంట్రీ'

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రతిపక్షంపై కక్షపూరిత చర్యలకు పాల్పడిన ట్లు ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై చర్యలు ప్రారంభమయ్యాయి. కొత్త ప్రభుత్వం ఇంకా ఏర్పాటు కానప్పటికీ కొందరు ఉన్నతాధికారులు తమ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం చంద్రబాబుని కలిసి అభినందనలు తెలియజేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి వ్యక్తిగత కారణాలు సాకుగా చూపి సెలవు పెట్టినట్లు తెలిసింది. కాగా చంద్రబాబుతో భేటీ అనంతరం జవహర్ రెడ్డిని సెలవుపై వెళ్లాలంటూ టీడీపీ నేతలు సూచించారని... అయితే తనకు సమయం కావాలని వారితో జవహర్ రెడ్డి పేర్కొన్నారని సమాచారం. ఈనెల 12వ తేదీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సీఎస్ నేతృత్వం వహించనున్నారు. జవహర్ రెడ్డి అధ్వర్యంలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడానికి ఇష్టపడడం లేదు. అదే విషయాన్ని ఆయనకు తెలియజేశారు. అలాగే ఎన్నికల సమయంలో వృద్ధులు,

వికలాంగులు, వితంతువుల పెన్షన్లపై సీఎస్ వివాదాస్పద నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై టీడీపీ అప్పట్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసేంది. అలాగే దీనిపై ఈసీ సైతం స్పందించి... వద్దని స్పష్టం చేసింది. దాంతో ఈ అంశంపై హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్‌ను సీఎస్ జవహర్ రెడ్డి వేయించారనే ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క అధికార వైసీపీకి రాజకీయ లబ్ధి కలిగించేందుకు సీఎస్ ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. జనవరిలో బటన్ నొక్కిన పథకాలకు వెంటనే డబ్బులు జమ చేయకుండా వ్యూహాత్మకంగా ఎన్నికల పోలింగ్‌కు రెండు రోజులు ముందు లబ్ధిదారుల ఖాతాలో నగదు వేయాలని జవహర్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపైనా టీడీపీ ఆగ్రహంగా ఉంది. ఇంకోవైపు విశాఖపట్నంలో జరిగిన భూ కుంభకోణంలో ఆయన కుమారుడి ప్రమేయం ఉన్నట్లు జనసేన నాయకుడు మూర్తి యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. ఆ విమర్శలకు సీఎస్ జవహరెడ్డి సైతం స్పందించారు. అనంతరం విశాఖ వేదికగా జరిగిన భూ కుంభకోణంపై సీఎస్ జవహర్ రెడ్డికి మూర్తి యాదవ్ ఆధారాలతో కొన్ని ప్రశ్నలు సంధించారు. వీటికి సమాధానం చెప్పాలంటూ సీఎస్‌కు సవాల్ విసిరారు. ఈ స్థితిలో మొత్తానికి సీఎస్ సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అదే బాటలో ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ఎస్ రావత్ కూడా అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు.

పీఎస్సార్, సంజయ్, రఘురామిరెడ్డికి భంగపాటు

కాబోయే సీఎం చంద్రబాబును కలిసేందుకు యత్నించిన వివాదాస్పద ఐపీఎస్ అధికారులకు భంగపాటు ఎదురైంది. మర్యాదపూర్వక భేటీ పేరుతో కొందరు ఐపీఎస్ అధికారులు గురువారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్దకు రాగా వారికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. తొలుత చంద్రబాబును కలిసేందుకు సీఐడీ చీఫ్ సంజయ్ రాగా... కరకట్ట గేటు వద్దే కానిస్టేబుళ్లు ఆయన కారును ఆపి వెనక్కి పంపారు. సంజయ్ వచ్చిన విషయాన్ని చంద్రబాబు నివాసంలోని అధికారులకు గేటు దగ్గర సెక్యూరిటీ సిబ్బంది

- మిగతా 2 లో

దిల్లీకి నీళ్లివ్వండి

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీని తీవ్రమైన నీటి సంక్షోభం వెంటాడుతోంది. అక్కడి ప్రజలు నీటి చుక్క కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ నీటి సంక్షోభాన్ని తీర్చడానికి యమునా మిగులు నీటిని విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని గురువారం ఆదేశించింది. జూన్ 7వ తేదీన 137 క్యూసెక్కుల యమునా మిగులు నీటిని హర్యానాలోని హథినీకుండ్ బ్యారేజికి విడుదల చేయాలని సుప్రీం ఆదేశించింది. హథినీకుండ్ బ్యారేజికి విడుదలైన నీటిని నేరుగా దిల్లీలోని వజీరాబాద్‌కు విడుదల చేయాలని జస్టిస్ పీకే మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో దిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారంలోగా సమ్మతి అఫడవిట్‌లు దాఖలు చేయాలని సుప్రీం కోరింది. కాగా, నీటి కొరతను తీర్చేందుకుగాను యమునా నది మిగులు జలాలను విడుదల చేసే విధంగా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించాలని ఇటీవల దిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం విచారించింది. ఈ మేరకు హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించింది.

కీలక శాఖలు మోదీ వద్దేనా?

- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కసరత్తు
- మంత్రివర్గ కూర్పుపై అగ్రనేతల చర్చ
- కూటమి విస్తరణపైనా దృష్టి
- నేడు ఎన్డీఏ ఎంపీల భేటీ



న్యూదిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. మూడోసారి భారత ప్రధానిగా నరేంద్రమోదీ 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు వడివడిగా జరుగుతున్నాయి. ఇక మోదీ కేబినెట్ మంత్రులు ఎవరనే అంశంపైనే ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు బీజేపీ అగ్రనేతలు దిల్లీలో సమావేశమయ్యారు. గురువారం ఉదయం బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో పార్టీ అగ్రనేతలు, ఆర్ఎస్ఎస్ కీలక నేతలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రివర్గ కూర్పు, కూటమి పక్షాలతో సమన్వయంపై చర్చించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మిత్రపక్షాలకు మంత్రివర్గంలో వాటాపై కసరత్తు జరిగింది. అలాగే ఎన్డీఏ కూటమి విస్తరణపైనా చర్చించారు. తటస్థంగా ఉన్న చిన్న పార్టీలను కూటమిలోకి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఈ విషయంపై

- మిగతా 2 లో

ఇకపై రాజకీయ పాలన

- పార్టీ శ్రేణులకు పూర్తి ప్రాధాన్యతిచ్చి మార్పు చూపిస్తా
- బిజీగా ఉన్నా సమయం కేటాయిస్తా
- మీరు బాధ్యతగా ప్రజలకు సేవ చేయండి
- ఎంపీలతో టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: గతంలో వలే కాకుండా ఈసారి రాజకీయ పాలన ఉంటుందని ఎంపీలకు టీడీపీ అధినేత చంద్ర బాబు స్పష్టం చేశారు. ఇకపై మీరు మారిన చంద్రబాబును చూస్తారు. బ్యూరోక్రాట్స్ పాలన ఎంత మాత్రం ఉండదు. చంద్రబాబు మారరు అనే అపవాదు నాపై ఉంది. ఇక అలా ఉండదు. మీరే ప్రత్యక్షంగా చూస్తారు. ఎంపీలందరూ తరచూ వచ్చి కలవండి. నేను బిజీగా ఉన్నా కూడా మీతో

- మిగతా 2 లో

12న చంద్రబాబు ప్రమాణం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12న మధ్యాహ్నం 12 గంటలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. అంతకుముందు 11వ తేదీ టీడీపీ శాసనసభ్యుల సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో టీడీఎల్పీ నేతగా చంద్రబాబుని ఎన్నుకోనున్నారు. అనంతరం అదే రోజు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి శాసనసభ్యుల జాబితాను అందజేసి...ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా

- మిగతా 2 లో

హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి

చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

8లో

ఆంధ్రప్రదేశ్‌కు దక్కాల్సిన విభజన చట్టం హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం తదితర సమస్యల పరిష్కారానికిగాను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు.

ముగిసిన ఎన్నికల కోడ్

- కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు
- గవర్నర్‌కు ఎమ్మెల్యేల జాబితా అందజేసిన సీఈవో మీనా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో కోడ్ ఎత్తివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గురువారం సాయంత్రం 6 గంటలతో ఎన్నికల కోడ్ ముగిసినట్టు

- మిగతా 2 లో

రేపు సీడబ్ల్యూసీ భేటీ

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చించేందుకు శనివారం సీడబ్ల్యూసీ సమావేశాన్ని కాంగ్రెస్ నిర్వహించబోతోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే నేతృత్వంలో ఈ సమావేశం జరగనుంది. 8వ తేదీ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ కాబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు హాజరు కానున్నారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ 99 లోక్‌సభ స్థానాలను గెలుచుకొని రెండవ పెద్ద పార్టీగా నిలిచిన విషయం తెలిసిందే.

ఇదీ లోకం!



సో..వైజాగు వెళ్లే భాగ్యం ఇక ఈ జన్మలో లేనట్టే!

అతిపెద్ద 'స్టాక్ స్కామ్'

రూ.31 లక్షలకోట్ల సంపద ఆవిరిపై రాహుల్

మోదీ, షాపై విచారణకు డిమాండ్

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు స్టాక్ మార్కెట్ ఎరుపెక్కింది. రూ.31 లక్షలకోట్ల సంపద ఆవిరైంది. ఫలితాలకు ముందు ఎన్డీయే విజయాన్ని ఆకాంక్షిస్తూ స్టాక్‌మార్కెట్ 3వ తేదీన అమాంతం పెరిగింది.

2లో

ఎందుకు ఓడాం?

- ముఖ్య నేతలతో జగన్ భేటీ
- ఎంపీ, ఎమ్మెల్యేల హాజరు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంపై వైసీపీ ముఖ్యనేతలతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ భేటీ అయ్యారు. తాడేపల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్యనేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని వెంకట్రామయ్య(నాని), శ్రీకొడాలి వెంకటేశ్వరరావు(నాని) తదితరులు గురువారం భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై విశ్లేషించుకున్నారు. పార్టీ కీలక నేతలతోపాటు గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు జగన్‌తో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఓటమి పాలైన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు జగన్‌ను కలిశారు. ఇంత ఘోర ఓటమి ఎందుకు వచ్చింది?, ఫలితాల్లో ప్రత్యర్థి ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు భారీగా సీట్లు, మెజార్టీలు ఎలా వచ్చాయన్న దానిపై ఆరా తీవారు. అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలకే పరిమితం కావడానికి గల కారణాలు, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చించారు. దాదాపు గంటపాటు సమావేశం జరిగింది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ క్రమేపీ పెరుగుతూ వస్తున్నది. కడప ఎంపీ,

- మిగతా 2 లో

2లో

'ఇండియా'కే మా మద్దతు: వీపీపీ

జాతీయస్థాయిలో ఇండియా ఐక్య సంఘటనకే తమ మద్దతు అని మేఘాలయ వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ (వీపీపీ) గురువారం ప్రకటించింది.

చూస్తూ ఊరుకోం

పాశ్చాత్య దేశాలకు పుతిన్ హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌తో తాము చేస్తున్న యుద్ధంలో పాశ్చాత్య దేశాల జోక్యంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎదురుదాడికి దిగారు. ఇది అలాగే కొనసాగితే తమ మిత్రదేశాలను ఉసిగొల్పుతామని పరోక్షంగా హెచ్చరించారు. జర్మనీ తమ ఆయుధాలను ఉక్రెయిన్‌తో ప్రయోగింపజేస్తోందని ఆరోపించారు. దీన్ని చాలా 'ప్రమాదకరమైన చర్య'గా అభివర్ణించారు. ఐదోసారి దేశ పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత పుతిన్ తొలిసారి అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జర్మనీ తమ ఆయుధాల ప్రయోగాన్ని నిలువరించకపోతే... తాము ఇతర దేశాలకు దీర్ఘశ్రేణి లక్ష్యాలు ఛేదించగల అస్త్రాలు సరఫరా చేస్తామని పుతిన్ అన్నారు. పాశ్చాత్య దేశాల్లోని లక్ష్యాలపై దాడికి ప్రోత్సహిస్తామని హెచ్చరించారు. జర్మనీ కవ్వింపు చర్యల వల్ల మొత్తం అంతర్జాతీయ భద్రతకే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. ఇది తమ దేశంపై ప్రత్యక్ష దాడిగానే భావిస్తామన్నారు. దీన్ని తిప్పికొట్టే హక్కు తమకు ఉంటుందని స్పష్టంచేశారు. మరోవైపు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలిచినా రెండు దేశాల మధ్య సంబంధాల్లో పెద్ద మార్పేమీ ఉండదని పుతిన్ స్పష్టం చేశారు. అగ్రరాజ్య ప్రజలు ఎవరిని ఎన్నుకున్నా... వాళ్లతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్రంప్ దోషిగా తేలడంపై స్పందిస్తూ... 'అంతర్గత రాజకీయ పోరులో భాగంగా న్యాయ వ్యవస్థను ఉపయోగించుకున్న ఫలితమే'నని వ్యాఖ్యానించారు. అణ్వస్త్ర ప్రయోగాలపైనా పుతిన్ స్పందించారు. తాము ఎప్పుడూ ముందస్తుగా అణుబాంబులు ఉపయోగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కానీ, ఇతర దేశాలు తమ భద్రతకు ముప్పు తలపెడితే మాత్రం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధం వల్ల తాము ఏం కోల్పోయామో చెప్పలేమని అన్నారు. అయితే, తమ కంటే ఉక్రెయిన్ సైనికులు ఐదింతలు అధికంగా మరణించారని పేర్కొన్నారు. ఉక్రెయిన్ వద్ద 1,300 మంది రష్యా సైనికులు బందీలుగా ఉన్నారని వెల్లడించారు. తమ వద్ద వాళ్ల సైనికులు 6,400 మంది ఉన్నట్లు తెలిపారు.

ఇజ్రాయిల్ దాడిలో 39 మంది సామాన్యుల మృతి

గాజా: గాజాలో దాడులపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నా...ఇజ్రాయిల్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇజ్రాయిల్ అమానుష దాడిలో వేలాదిమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా సెంట్రల్ గాజాలోని ఓ పాఠశాల భవనంపై జరిపిన వైమానిక దాడిలో... అక్కడ తలదాచుకుంటున్న 39 మంది పౌరులు మృతి చెందారు. వారిలో తొమ్మిది మంది మహిళలు, 14 మంది చిన్నారులు ఉన్నారని స్థానిక అధికారులు తెలిపారు. అయితే... హమాస్ ఉగ్రవాదులు ఆ పాఠశాలను తమ అడ్డాగా మార్చుకున్నారని ఇజ్రాయిల్ సైన్యం ఆరోపించింది. హమాస్ ఉగ్రమూకలు తిరిగి ఏకమవుతున్నాయన్న సమాచారం మేరకు సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ మరోసారి భూతల, గగనతల దాడులు ప్రారంభించింది. నుసిరత్‌లో 'యూఎన్ఆర్‌డబ్ల్యూఏ' అధ్వర్యంలో నడిచే అల్-సర్దీ పాఠశాల భవనంపై క్షిపణులతో విరుచుకుపడింది. ప్రస్తుతం శరణార్థి శిబిరంగా ఉన్న ఇందులో పలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్నారు. ఈ దాడిలో రెండు, మూడు అంతస్తులు ధ్వంసం కాగా... దాదాపు 33 మంది మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సమీపంలోని మరో ప్రాంతంపైనా జరిగిన దాడిలో ఆరుగురు మరణించారు. హమాస్ ఉగ్రవాదులు ఆ పాఠశాలలో ఆశ్రయం పొందుతూ... తమ బలగాలపై దాడులకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని టెల్‌అవీవ్ ఆరోపించింది. ఈ వాదనలకు తగిన ఆధారాలు వెల్లడించలేదు. తాజా ఘటనలో ప్రజల ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు వైమానిక నిఘా, అదనపు సమాచార సేకరణ వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఇదిలాఉండగా... గతవారం రఫాలో 'యూఎన్ఆర్‌డబ్ల్యూఏ' కేంద్రం సమీపంలో జరిగిన దాడిలో 45 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అమెరికా సహా ప్రపంచదేశాలు దీన్ని ఖండించాయి.

'ఇండియా'కే మా మద్దతు: వీపీపీ

షిల్లాంగ్: జాతీయస్థాయిలో ఇండియా ఐక్య సంఘటనకే తమ మద్దతు అని మేఘాలయ వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ (వీపీపీ) గురువారం ప్రకటించింది. జాతీయ స్థాయిలో ఏర్పడబోయే ఎన్డీఏ కూటమికి మీరు మద్దతు ఇస్తారా అని వీపీపీ నేత అర్డెంట్ మిల్లర్ బసయామ్మోయిట్‌ని మీడియా ప్రశ్నించగా... 'సైద్ధాంతిక విభేదాల వల్లే మా పార్టీ జాతీయస్థాయిలో కూడా కాషాయ పార్టీతో ఏకీభవించడం లేదు. తమ పార్టీ లౌకికవాదానికి, అన్ని మతాలను గౌరవించేందుకు కట్టుబడి ఉంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి కాదు.. మేము ఇండియా ఐక్య సంఘటనకే మద్దతు ఇస్తాం. మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం విపక్ష కూటమికి మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది' అని మిల్లర్ స్పష్టంచేశారు. కాగా, షిల్లాంగ్ స్థానంలో వీపీపీ అభ్యర్థి రికీ ఏజే సింకోన్... కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ విన్సెంట్ పాల్‌పై 3.7 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. తురా లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సలెంగ్ ఎ విజయం సాధించారు.

అతిపెద్ద 'స్టాక్ స్కామ్'

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు స్టాక్ మార్కెట్ ఎరుపెక్కింది. రూ.31 లక్షలకోట్ల సంపద ఆవిరైంది. ఫలితాలకు ముందు ఎన్డీయే విజయాన్ని ఆకాంక్షిస్తూ స్టాక్‌మార్కెట్ 3వ తేదీన అమాంతం పెరిగింది. కానీ ప్రతిపక్ష ఐక్యసంఘటన దెబ్బతో బీజేపీ ఢీలా పడటంతో ఫలితాల రోజు మార్కెట్‌లో బ్లడ్‌బాత్ జరిగింది. దీంతో స్టాక్‌మార్కెట్‌లో భారీ కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ఈ వారంలో స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు, నష్టాలు నమోదయ్యాయి. కానీ ఒక్కసారిగా రూ.31 లక్షలకోట్ల సంపద ఆవిరైంది. ఇది అతిపెద్ద స్టాక్‌మార్కెట్ కుంభకోణం. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలి' అని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ పరిణామం అనేక సందేహాలకు తావిస్తోందని చెప్పారు. 'స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ఐదు కోట్ల కుటుంబాలకు సలహాలను ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఎందుకు ఇచ్చారు? పెట్టుబడులపై సలహాలు ఇవ్వడం వారి పనా? స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేసినట్లు సెబీ దర్యాప్తు ఎదుర్కొంటున్న వాణిజ్య సంస్థకు చెందిన ఛానల్‌కే ఇంటర్వ్యూలు ఇవ్వడానికి కారణమేమిటి? బీజేపీకి, బూటకపు ఎగ్జిట్ పోల్‌స్టర్లకు, అనుమానాస్పద విదేశీ పెట్టుబడిదారులకు మధ్య సంబంధమేమిటి?' అంటూ మూడు ప్రశ్నలను రాహుల్ సంధించారు. ఎగ్జిట్ పోల్స్ తప్పని తెలిసి కూడా మార్కెట్లలో పెట్టుబడులు ప్రోత్సహించడం ఎందుకని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను నిలదీశారు. 'కొన్ని వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఈ ఇద్దరు తమకు మెజారిటీ వస్తుందని చెప్పుకున్నారు. జూన్ 4న మార్కెట్‌లో భారీ లాభాలు వస్తాయని పదేపదే చెప్పారు. ఫలితాలకు ముందే స్టాక్‌లు పెంచుకోవాలని పెట్టుబడిదారులకు కన్నుకొట్టి మరీ అమిత్‌షా చెప్పారు. ఫలితాల రోజు మార్కెట్‌లో బాణాసంచా వెలుగులు కాదు ఊహించని విధంగా విస్ఫోటనం జరిగింది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్‌షాతో పాటు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసిన వారిపై దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎందుకు ఓడాం ?

(మొదటిపేజీ తరువాయి)

పులివెందుల ఎమ్మెల్యే పదవులతో వైసీపీ ప్రస్థానం ప్రారంభించింది. కాంగ్రెస్‌ను విభేదించి జగన్‌తోపాటు వచ్చిన ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయడం, ఆ తర్వాత జరిగిన ఉపఎన్నికల్లోనూ వైసీపీ అధిక సీట్లు కైవసం చేసుకుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకుగాను 67 ఎమ్మెల్యే సీట్లు, 9 ఎంపీ స్థానాలు గెలుపొందింది. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ, 22 ఎంపీ సీట్లు గెలిచింది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాలకే వైసీపీ పరిమితమైంది. ఇంత దారుణమైన ఫలితాలు రావడం వైసీపీ నేతలకు అంతుచిక్కడం లేదు. ఎక్కడో తప్పిదం జరిగిందని అనుమానిస్తున్నారు. పార్టీ పరంగానా లేక ఈవీఎంల సాంకేతిక లోపంగానా అనేది తేల్చుకోలేకపోతున్నారు. వైసీపీ ఓటమిపై నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే కొందరు మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, జక్కంపూడి రాజా మీడియా ముందుకు వచ్చి...ఈవీఎంల తప్పిదంతోనే ఓటమి పాలైనట్లు చెబుతున్నారు. తాజాగా విజయవాడకు చెందిన వైసీపీ నాయకుడు పోతిన మహేశ్ కూడా ఈవీఎంల అంశాన్ని ప్రస్తావించారు. ల్యాండ్ టైటిల్ యాక్టుపై దుష్ప్రచారం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయ లోపం, ఎన్నికల నిర్వహణలో వెనుకబాటుకు గురికావడం కారణాలుగా మరికొంతమంది భావిస్తున్నారు. జగన్‌తో జరిగిన భేటీలోను పార్టీ ఓటమిపై అనేక అంశాలను ధ్రువీకరించినట్లు సమాచారం. వైసీపీకి ప్రతిపక్ష హోదా లేనందున... పార్టీ తరపున ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న అంశంపై స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. సమావేశానికి వైసీపీ తిరుపతి ఎంపీ గురుమూర్తి, పార్టీ నేతలు శివప్రసాద్‌రెడ్డి, దేవినేని అవినాశ్, వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఓట్ల లెక్కింపు అనంతరం వైసీపీ కార్యకర్తలు, వారి ఇళ్లపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న దాడులపై గవర్నరుకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. కాగా, తాడేపల్లిలో కొనసాగుతున్న పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సీఎం క్యాంపు కార్యాలయంలోకి మార్చాలని నేతలు నిర్ణయించారు.

ముగిసిన ఎన్నికల కోడ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. మార్చి 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చిన విష యం తెలిసిందే. అలాగే గత నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈనెల 4వ తేదీన వెల్లడి కాగా... దానికి సంబంధించి రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల జాబితాను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అందజేశారు. మీనా వెంట ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎంఎన్ హరెంధిర ప్రసాద్, కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఉన్నారు.

కీలక శాఖలు మోదీ వద్దేనా?

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదింపులు జరిపే బాధ్యతను అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌కు అప్పగించినట్లు తెలిసింది.

ఈ సమావేశంలో అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో పాటు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శులు సురేష్ సోని, అరుణ్ కుమార్, దత్తాత్రేయ హొసబళె తదితరులు పాల్గొన్నారు. ఇక కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ ఎంపీలంతా శుక్రవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సమావేశం కానున్నారు. ఈ భేటీలోనే నరేంద్ర మోదీని తమ నాయకుడిగా అధికారికంగా ఎన్నుకునే అవకాశముంది. అలాగే బీజేపీ పార్లమెంటరీ సమావేశం కూడా శుక్రవారమే జరగనుంది.

టీడీపీ, జేడీయూకు కేబినెట్ బెర్తులు

ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ, జేడీయూ పార్టీలు కీలకంగా మారాయి. ఈ రెండు పార్టీలకు కేబినెట్‌లో ప్రాధాన్యం లభించే అవకాశాలున్నట్లు సమాచారం. కేబినెట్‌లో టీడీపీ-5, జేడీయూ-2, జేడీఎస్-1 ఇలా మంత్రి పదవులను డిమాండ్లు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే కీలక శాఖలను మోదీ తన వద్దే ఉంచుకోనున్నట్లు తెలుస్తోంది. హోంశాఖ, రక్షణ, విదేశాంగ, ఆర్థిక, రోడ్లు, రైల్వే, మౌలిక వసతులు, సంక్షేమంతోపాటు లోక్‌సభ స్పీకర్ పదవిని కూడా బీజేపీ తన వద్దే ఉంచుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. స్పీకర్ పదవిని తెలుగుదేశం పార్టీ ఆశించినట్లు తెలిసింది. అయితే, స్పీకర్ పదవికి బదులు డిప్యూటీ స్పీకర్ పదవిని టీడీపీకి కేటాయించేందుకు బీజేపీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దాంతోపాటు పౌర విమానయాన, ఉక్కు శాఖ సైతం టీడీపీకే కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఇక జేడీయూకి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, జేడీఎస్‌కు వ్యవసాయ శాఖ, శివసేనకు భారీ పరిశ్రమల శాఖను కేటాయించనున్నట్లు సమాచారం. వీటితోపాటు టూరిజం, స్కిల్ డెవలప్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి ఇతర శాఖలను కూడా మిత్రపక్షాలకు పంచేందుకు బీజేపీ సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేబినెట్‌లోని కీలక శాఖలను మాత్రం బీజేపీ ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునేందుకు సిద్ధంగా లేదని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

విదేశీ నేతలకు ఆహ్వానం

దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దేశంలో అగ్రనేతలతో పాటు విదేశీ నాయకులకు ఆహ్వానాలు వెళ్లాయి. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ అధినేతలకు అధికారిక ఆహ్వానాలు పంపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జును కూడా కేంద్రం ఆహ్వానించడం గమనార్హం. ఆ దేశంతో దౌత్యపరమైన ఒడుదొడుకులు కొనసాగుతోన్న తరుణంలో ఈ ఆహ్వానం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫలితాల అనంతరం ఎన్డీయే కూటమి విజయంపై ముయిజ్జు అభినందనలు తెలియజేసిన సంగతి తెలిసిందే. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోగ్బే, మారిషస్ ప్రధానమంత్రి పర్విండ్ జుగ్నౌత్‌లు మోదీ ప్రమాణస్వీకారానికి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

12న చంద్రబాబు ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

కోరతారు. కాగా ప్రమాణ స్వీకార వేదిక కోసం అమరావతిలోని కొన్ని విశాల ప్రాంతాలను టీడీపీ నేతలు పరిశీలిస్తున్నారు.వాస్తవానికి ఈ నెల 9వ తేదీనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని చంద్రబాబు భావించారు. అయితే ఆరోజు ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఆ కార్యక్రమానికి ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేతగా చంద్రబాబు హాజరు కావాల్సి ఉంది. అందుకే తన ప్రమాణస్వీకారాన్ని మరో మూడు రోజులు వాయిదా వేసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి నరేంద్ర మోదీతో పాటు ఎన్డీఏ ముఖ్యనేతలు హాజరయ్యే అవకాశముంది. బుధవారం ఎన్డీఏ సమావేశానికి హాజరైన సందర్భంగా మోదీని తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని చంద్రబాబు ఆహ్వానించగా... ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చంద్రబాబుకు తెలంగాణ సీఎం అభినందన

టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు సామరస్యంగా పరిష్కారం చేసుకుందామని చంద్రబాబును ఈసందర్భంగా రేవంత్ రెడ్డి కోరినట్లు తెల్సింది. ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు గతంలో సీఎం రేవంత్ రెడ్డి తిరుపతి దేవస్థానాన్ని సందర్శించిన సందర్భంగా మీడియాతో చెప్పిన విషయం తెల్సిందే.

టీచర్ల బదిలీలకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

అవుతారని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. కోడ్ కూడా ముగియడంతో ఉపాధ్యాయులు కోరుకున్న స్థానాలకు బదిలీలపై వెళ్లేందుకు సిద్ధమవ్వగా, ఈలోగా వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా...అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు అడ్డదారుల్లో బదిలీల ఉత్తర్వులు పొందడంతోనే ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి. కొందరు రాజకీయ పలుకుబడితోను, మరికొందరు మధ్యవర్తుల ద్వారా డబ్బులు ఎరవేసి బదిలీలకు ప్రయత్నించారు. ఒక్కో పోస్టుకు లక్ష రూపాయలకుగాపైగా వసూలు చేసినట్లు సమాచారం. దీనివల్ల పెద్దఎత్తున అధికారులు, మధ్యవర్తుల మధ్య చేతులు మారినట్లుగా, విద్యాశాఖలోని కొందరు సిబ్బంది సైతం సూత్రధారులుగా నిలిచినట్లు తెలిసింది. బదిలీలకు కీలకంగా గత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేషీ నుంచి వచ్చిన ఉత్తర్వులు వెలువడినట్లుగా తెలుస్తోంది. దీనిపై రాబోయే ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించే అవకాశముంది. దీంతో బదిలీలకు వినతి చేసిన ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. అడ్డదారుల్లో బదిలీల వ్యవహారం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ జరుగుతున్నది. ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చినప్పుడుగానీ, చివరి దశలోగానీ పెద్దఎత్తున బదిలీలకు తెరదీస్తారు. ఇదే దిశగా ముగిసిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ బదిలీలు కొనసాగాయి. వాస్తవంగా ఉపాధ్యాయుల బదిలీలు ప్రతిఏటా పాఠశాలలల పున:ప్రారంభానికి ముందు నిర్వహిస్తారు. ఆ సమయంలో చాలా మంది వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు పెట్టుకుని బదిలీలు అవుతారు. అలా వచ్చిన స్థానం నచ్చకపోవడంతో రాజకీయ పలుకుబడి, ముడుపులు అప్పజెప్పి ఉపాధ్యాయులు బదిలీలు పొందినట్లు సమాచారం.

చర్యలు షురూ!

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అనుమతి లేదని చెప్పడంతో ఆయన కారును వెనక్కి పంపారు. చంద్రబాబుపై అక్రమ కేసుల నమోదులో సంజయ్ కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల ఫలితాలు రాగానే విదేశాలకు వెళ్లేందుకు సెలవు పెట్టగా... అనుమతి ఇవ్వలేదని తెల్సింది. ఆ తర్వాత ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు చంద్రబాబు నివాసం వద్దకు చేరుకోగా ఆయనకు కూడా అనుమతి లేదని చెప్పారు. ఎన్నికల విధుల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఆయన్ను ఎన్నికల సంఘం (ఈసీ) తప్పించిన విషయం తెల్సిందే. ఆ తర్వాత అనధికారికంగా కూడా వైసీపీ విజయం కోసం పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు నివాసానికి వెళ్లే మార్గంలో ప్రధాన గేటు వద్దే కానిస్టేబుళ్లు పీఎస్ఆర్ కారును ఆపారు. లోపలికి అనుమతి లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేదేమీ లేక ఆయన వెనుదిరిగారు.మరో సీనియర్ ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డికి కూడా అనుమతి నిరాకరించారు. చంద్రబాబును కలిసేందుకు ఫోన్‌లో అధికారులను ఆయన అనుమతి కోరగా తిరస్కరించారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసే సమయంలో రఘురామిరెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల సమయంలో వైసీపీకి విధేయుడిగా ఉన్నారంటూ ఈసీ ఆయనపై కొరడా ఝుళిపించింది. డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించింది. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికీ ఇదే పరిస్థితే ఎదురైంది. చంద్రబాబును కలిసేందుకు వెళ్లగా... అనుమతి లేదని గేటు వద్దే పోలీసులు ఆయన కారును ఆపివేయడంతో వేణుగోపాల్‌రెడ్డి వెనుదిరిగారు.

మంత్రుల నివాసాల్లో ఫైళ్ల స్వాధీనంపై జీఏడీ ఆదేశాలు జారీ

జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రుల పేషీల్లోని సిబ్బంది మొత్తాన్ని మాతృ శాఖలకు పంపించారు. ఈ నెల 11వ తేదీలోగా ఆయా మంత్రుల పీఏ, పీఎస్, ఏపీఎస్‌లను వారి వారి మాతృ శాఖల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రుల పేషీల్లోని ఫైళ్లు, రికార్డులు, డాక్యుమెంట్లను సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఫర్నీచర్, కంప్యూటర్, స్టేషనరీల జాబితాను రూపొందించి ఇవ్వాలని జీఏడీ ఆదేశించింది. నో డ్యూస్ సర్టిఫికెట్లు తీసుకోవాలని, మంత్రుల నివాసాల్లో ఉన్న ఫర్నీచర్‌ను కూడా గుర్తించి ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రుల నివాసాల్లో ఉన్న ఫైళ్లను కూడా సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు అందజేయాలని జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఆదేశించారు.

ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌కూ చుక్కెదురు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో ఏపీ నుంచి రిలీవ్ చేయాలని సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డి పెట్టుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైంది. బటన్ నొక్కుడు పేరుతో అధికారపార్టీ పత్రికకు, వారికి అనుకూలంగా వ్యవహరించే మీడియాకు ప్రకటనల రూపంలో భారీగా దోచిపెట్టినట్లు కమిషనర్‌పై ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ముందు తనకు పొడిగింపు ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న విజయ్ కుమార్ రెడ్డి, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని తేలడంతో తనను రిలీవ్ చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం రిలీవ్ చేసేది లేదని విజయ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం తేల్చి చెప్పింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ కొనసాగాలని ఆదేశించింది.

ఇకపై రాజకీయ పాలన

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతా. నాకోసం ఈ ఐదేళ్ల నేతలు, కార్యకర్తలు ప్రాణాలిచ్చారు. నిద్రలేని రాత్రులు గడిపారు. కత్తి మెడ మీద పెట్టినా జై టీడీపీ, జై చంద్రబాబు అన్నారు. అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ తలొగ్గలేదు. పార్టీ శ్రేణుల త్యాగాలను మరిచిపోలేను. వారికి ఇకపై పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాను. ఈ ఐదేళ్ల కార్యకర్తలు పడిన ఇబ్బందులు మనోవేదన కలిగించాయి. నేతలు, కార్యకర్తల కృషి వల్లే పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రతి అంశాన్ని నేనే వింటా. నేనే చూస్తానంటూ చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ ఎంపీలతో పార్టీ అధినేత చంద్రబాబు గురువారం సమావేశమయ్యారు. అందుబాటులో లేని ఎంపీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఉండవల్లిలోని తన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో మంత్రివర్గ కూర్పు, టీడీపీకి ఎన్డీఏ కూటమిలో ఉన్న ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో విహరించొద్దని గెలిచిన ఎంపీలకు స్పష్టం చేశారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు వినియోగించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలంతా కలిసి ఎవరి పరిధిలో వారు పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోని వైసీపీ ఎంపీలు, జగన్ కేసుల మాఫీ అజెండాతోనే దిల్లీలో పైరవీలు చేశారన్నారు. కానీ మన కర్తవ్యం వేరు అని ఎంపీలకు చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలని సూచించారు. అందుకు తగ్గట్లుగానే పార్లమెంట్‌లో కృషి చేయాలన్నారు. ముందు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించాలని, ఆ తరువాతే మనం అని చంద్రబాబు అన్నారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా, ఆ వ్యవస్థే తిరిగి కాటేస్తుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని, పదవులు శాశ్వతమని ఎవరూ అనుకోవద్దని చెప్పారు. ఈ నెల 12వ తేదీన సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని, ఈసారి ఎన్నికైన ఎంపీల టీమ్ చాలా బాగుందన్నారు. గతంలో ఎర్రంనాయుడు ఉన్నప్పుడు ఇటువంటి టీమ్ ఉంది. ఈ టీమ్ దిల్లీలో రాష్ట్ర ప్రయోజనాల కోసం బాగా పని చేస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించామని, ఆయన వచ్చేందుకు సానుకూలంగా స్పందించారని చంద్రబాబు తెలిపారు.

మా జీవితాలతో చెలగాటమొద్దు

ఉన్నత స్థాయి దర్యాప్తు

మళ్లీ పరీక్షకు విద్యార్థుల డిమాండ్

67 మందికి నీట్ మొదటి ర్యాంకుపై వివాదం



న్యూఢిల్లీ: నీట్ ఫలితాలు వెలువడగా 67 మందికి మొదటి ర్యాంకు రావడం, ఇందులో హర్యానాలోకి ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు ఉండటం వివాదానికి తెరతీసింది. అందరికీ 720కుగాను 720 మార్కులు రావడం అనేక సందేహాలకు తావిచ్చింది. నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని, వైద్యవిద్య కోసం ప్రవేశ పరీక్ష పారదర్శకంగా నిర్వహించాలని విద్యార్థులు అన్నారు.

తమ జీవితాలతో చెలగాటం ఆడవద్దని, ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు, పరీక్షా సమయాన్ని కోల్పోవడం వంటి కారణాలతో విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 67 మందికి మొదటిర్యాంకు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ విధానంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. 'చాలా మంది విద్యార్థులు సరైన అంశాలను లేవనెత్తారు. క్రమ సంఖ్యలో పరీక్ష రాసిన విద్యార్థులకు ఒకేలా మార్కులు ఎలా వస్తాయి? ఇది తేలికగా తీసుకునే అంశం కాదు. దేశానికి ఇలాంటి వైద్యుల అక్కర్లేదు. దీనిపై దర్యాప్తు జరిపించాలి' అని ఇండియా వైడ్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది అనుభా శ్రీవాత్సవ పేర్కొన్నారు. నీట్ పరీక్షా ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం ప్రకటించింది. మే5న 571 నగరాల్లో పరీక్ష జరిగింది. మొత్తం 4,750 మంది హాజరయ్యారు.

గ్రేస్ మార్కులతోనే: ఏన్‌టీఏ

విద్యార్థులకు మార్కులను పెంచడంపై ఎన్‌టీఏ వివరణ ఇచ్చింది. పరీక్షా సమయాన్ని కోల్పోయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చారు కాబట్టి వారికి 718 లేక 719 మార్కులు వచ్చి ఉండవచ్చని ఒక ప్రకటన చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల ఆధారంగా ప్రశ్నాపత్రం తయారైందని, కొందరు విద్యార్థుల వద్ద పాత పాఠ్యపుస్తకాలు ఉన్నాయని ఎన్‌టీఏ అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. తమకు అనేక ఫిర్యాదులు రావడంతో రెండు ఐదు మార్కులు అదనంగా ఇచ్చినట్లు చెప్పారు. దీంతో 44 మందికి 715 నుంచి 720 మార్కులు రావడంతో టాపర్లు పెరిగారన్నారు. కోర్టు కేసులు, ఫిర్యాదుల నేపథ్యంలో పరీక్షా సమయాన్ని కోల్పోయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు అధికారి తెలిపారు. కొన్ని పరీక్షా కేంద్రాల విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావడానికి గ్రేస్ మార్కులు దోహదమై ఉంటాయని వెల్లడించారు.

చేతకానీ ప్రభుత్వం వల్లే: కాంగ్రెస్

యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో విమర్శించింది. 'తొలుత పేపర్ లీక్... ఇప్పుడు ఫలితాల్లో తప్పిదాలు. దేశ యువత భవిష్యత్ నాశనమవుతోంది. ఏ పరీక్ష కూడా ప్రశ్నాపత్రం లీకేజీ లేకుండా ఈ ప్రభుత్వం నిర్వహించలేదని స్పష్టమైపోయింది. విదేశాల్లో యుద్ధాలనే ఆపేసినట్లు గొప్పలు పోయే వీరికి స్వదేశంలో పేపర్ లీకులను ఆపడం చేతకాదా' అని దుయ్యబట్టింది.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

బోర్డు వైఫల్యంపై ఏఐవైఎఫ్ ధర్నా

విశాలాంధ్ర-హైదరాబాద్: నిబంధనలు పాటించని కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇంటర్ విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ... అనధికార కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డ్ విఫలం చెందిందని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో ఇంటర్ బోర్డ్ గుర్తింపు పొందని వందలాది కళాశాలలు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సర అఫిలియేషన్ పూర్తి చేయకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా అనుమతులు మంజూరు కాని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వలన విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. అడ్మిషన్ ఒక చోట తరగతులు మరో చోట నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 200కుపైగా జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని భవనాలలో, ఫైర్ సేఫ్టీ, ట్రాఫిక్ ఎన్‌ఓసీ లేకుండా, మల్టీ ఆక్యుపెన్సీ వ్యాపార భవన సముదాయాలలో అనధికారికంగా తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అరకొర సదుపాయాలు కల్పించడం, లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేయడం, అర్హత లేని బోధనా సిబ్బందితో పాఠాలు చెప్పడం ద్వారా విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 432 మల్టీ ఆక్యుపెన్సీ వ్యాపార భవన సముదాయాలలో నడుస్తున్న కళాశాలలకు అనుమతులు మంజూరు కాలేదన్నారు. తనిఖీలు నామమాత్రంగా నిర్వహించి అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే సందేహాలు వ్యక్తమౌతున్నాయని అన్నారు.

విభజన హామీల సాధనకు కృషి చేయాలి: చలసాని

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ఆర్థిక పరిస్థితిని అధిగమించేందుకు విభజన హామీల సాధనకు కృషి చేయాలని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వైజాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జైభారత్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, సాధన సమితి విశాఖ జిల్లా కన్వీనర్ ఏజే స్టాలిన్, సభ్యులు వీ కృష్ణారావు, ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ గొలివి అప్పలనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కంటే కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి రూ.లక్ష కోట్లపైగా బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏ విధంగా ఆదాయ వనరులు సమకూరుస్తుందో చెప్పాలన్నారు. అవన్నీ నెరవేరాలంటే ప్రత్యేక హోదాయే మార్గం అని సూచించారు. ఆదాయ వనరులు లేకుంటే మళ్లీ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోతుందన్నారు. కూటమి సహకారంతో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, విభజన హామీల సాధనకు సరైన సమయం ఇదేనని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలంటే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ తోపాటు స్టీల్ ప్లాంట్ పర్యవేక్షణకు సొంత గనులు కేటాయింపు వంటివి సాధిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. లోక్‌సభ, రాజ్యసభ కలిపి 35 మంది ఎంపీలు రాష్ట్రానికి ఉన్నారనీ, విభజన హామీలపై పోరాడే సమయం వచ్చిందని, ఆ దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.1.43 లక్షల కోట్ల ఆస్తులు ఉండేవని, రాష్ట్ర విభజనలో చాలావరకు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ సాధిస్తే రాష్ట్రమంతా సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నారు.

నిబద్ధతగల కమ్యూనిస్టు సీఆర్

జేవీఎస్ మూర్తి నివాళి

విశాలాంధ్ర-విశాఖ: స్వాతంత్ర్య సమరయోధుడు, సామ్యవాది, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నిబద్ధత గల కమ్యూనిస్టు అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కొనియాడారు. సీఆర్ 110వ జయంతి విశాఖ అల్లిపురం సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 28 సంవత్సరాలకు పైగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీఆర్...1992లో అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకున్నారని చెప్పారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను, శాంతి ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లినందుకు రాజేశ్వరరావును 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' అవార్డుతో సోవియట్ యూనియన్, 'ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్' అవార్డుతో బల్గేరియా, చెకొస్లోవేకియా, మంగోలియా సైతం అవార్డులతో సత్కరించాయని తెలిపారు. దేశ సమైక్యతను కాపాడటం కోసం బాబ్రీ మసీదును మ్యూజియంగా ఏర్పాటు చేయాలని రాజీ ఫార్ములా ప్రతిపాదించారని చెప్పారు. మానవతావాది రాజేశ్వరరావు పార్టీ కార్యాలయాలలో పనిచేసే చిన్న కార్యకర్తలను సైతం ఆప్యాయంగా పలకరించేవారని, ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో ఉండి కూడా కార్యదర్శి లేకుండానే పని నిర్వహించారన్నారు. దిల్లీలో వేసవిలో ఉష్ణోగ్రతలు భరించలేనంత ఉన్నప్పటికీ కూలర్ కానీ, ఎముకలు కొరికే చలి ఉన్నా హీటర్ కానీ వాడేవారు కాదని తెలిపారు. పార్టీ క్యాంటీన్‌లో వలంటీర్లతో కలిసే భోజనం చేసేవారని చెప్పారు. 'నాకు ఆస్తిపాస్తులు లేవు. నేను ఎవరికీ ఏమీ ఇవ్వవలసిన అవసరం లేదు. ఎవరి నుంచీ ఏమీ తీసుకోలేదు' అని వీలునామా రాసిన గొప్ప నాయకుడు సీఆర్ అని నివాళి అర్పించారు. పంచె కాలిపైకి కట్టి, నెత్తికి తలగుడ్డ చుట్టి గ్రామీణ ప్రజలతో కలిసిపోవడం ఆయన నైజమన్నారు. తన వైఖరిని, విధానాలను ఎవరైనా విమర్శించినా ఓపికతో వినేవారన్నారు. మహిళలు సభలకు హాజరయ్యేందుకు వీలుగా రాత్రి వేళల్లో సమావేశాలు పెట్టవద్దని సూచించేవారని, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు జరిగితే వెంటనే స్పందించి స్వయంగా వెళ్లేవారని గుర్తు చేశారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఐక్య కార్యాచరణ ముందుకు సాగాలని కోరుకునేవారన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ 1994 ఏప్రిల్ 9న మరణించిన సీఆర్ నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శమని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రెహమాన్, ఎం.మన్మధరావు, జి.కాసులరెడ్డి, ఆడారి ఆదినారాయణ, వై.రామారావు, ఎన్.సూరిబాబు, ఎం.శ్రీనివాస్, బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం: అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టిందని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంస్కరణలను అమలు చేసిందని, కానీ పార్టీ కార్యకర్తలకు తగిన గౌరవం లభించలేదని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. విశాఖ ఎంపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సుపరిపాలన తీసుకువచ్చామని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామని, ఇదే సందర్భంలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేశామని చెప్పారు. 2009లో వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత పది సంవత్సరాలు పాటు కార్యకర్తలే పార్టీకి అండగా ఉన్నారని, 2019 ఎన్నికల్లో పార్టీ అద్భుత విజయం సాధించడానికి కార్యకర్తలే కారణమని, కానీ ఈసారి వాళ్ల మనోభావాలను గుర్తించలేకపోయామని అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. కూటమికి ప్రజలు మంచి అవకాశం ఇచ్చారని, ప్రజలకు వారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రానికి వీరి అవసరం ఉన్నందున, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కావలసిన నిధులను కూడా రాబట్టుకొని రాష్ట్ర క్షేమం కోసం పనిచేయాలని కూటమినేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అడగకుండానే సంక్షేమ పథకాలు అందజేశారని, 99 శాతం మేనిఫెస్టోను అమలు చేశారని అయినప్పటికీ ఎన్నికల్లో ఇటువంటి ఫలితం రావడం ఆశ్చర్యానికి గురిచేసిందని అమర్నాథ్ చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రజల కాళ్ల దగ్గరికు తీసుకెళ్లినా ఎన్నికల్లో ప్రజలు తమకు ఇలాంటి తీర్పు ఇవ్వటం బాధాకరమని పేర్కొన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని జగన్ ఆలోచించారని, మూడు రాజధానులు ప్రకటించినా అమరావతికి మేము ఎప్పుడు వ్యతిరేకం కాదని తెలియజేశారు. ఎన్నికల్లో ఓట్ షేర్ 100 శాతం జరిగిందని, సామాజిక వర్గాలు, ప్రాంతీయ తత్వాలు గురించి ఎవరు ఆలోచించలేదని, కూటమికి ఓటేస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుందని తెలిసినా గాజువాక ప్రజలు కూటమికే ఓటు వేశారని అమర్నాథ్ అన్నారు. తాము ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడమని పవన్ కల్యాణ్ ప్రకటించారని, ఈ ప్రకటన వెలువడిన 48 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దాడుల సంస్కృతి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, కార్యకర్తలను వేధిస్తే చూస్తూ సహించబోమని అమర్నాథ్ హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.

'నల్లూరి' జీవితం ఆదర్శనీయం

90వ జన్మదిన వేడుకలో ఓబులేసు

విశాలాంధ్ర-ఒంగోలు: కమ్యూనిస్టు పార్టీకి, యువజన, విద్యార్థి, కళా రంగాలకు నల్లూరు వెంకటేశ్వర్లు చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు అన్నారు. ఒంగోలు జిల్లా మద్దిపాడు మండలం మారెళ్ళ గుంటపాలెం ఆసరా కేంద్రంలో గురువారం ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) 90వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసరా కేంద్రం అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ నల్లూరు పేరు వింటేనే కమ్యూనిస్టు, యువజన ఉద్యమాలకు, ప్రజాకళా రంగానికి నూతన ఉత్తేజం వస్తుందని అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది కళాకారులను తీర్చిదిద్దిన వ్యక్తి అన్నారు. ప్రజా కళారంగానికి ప్రతినిధి అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ నల్లూరి... రాష్ట్రంలో యువజన, కళ, విద్యార్థి ఉద్యమానికి రథసారథిలా పనిచేశారన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నేటికీ ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్న నల్లూరి జీవితం నేటి తరానికి మార్గదర్శకం అన్నారు. ఈ సందర్భంగా అన్న నల్లూరిని ఘనంగా సత్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆసరా కేంద్రం కార్యవర్గ సభ్యుడు నాతాని భూపతి, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, జిల్లా నేతలు ఉప్పుటూరి ప్రకాశరావు, రమేశ్ (హైదరాబాద్), ఏపీ ప్రజానాట్యమండలి తరపున పూర్ణచంద్రరావు (గుంటూరు), సీపీఐ నేతలు పావులూరి అంజయ్య, కోటయ్య పాల్గొన్నారు.

వైసీపీ అవినీతికి మొదటి అడ్డుకట్ట: అశోక్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అవినీతి అరాచకానికి మొదటి అడ్డుకట్ట పడిందని, అవినీతి అధికారులు, వైసీపీతో అంటకాగిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు హెచ్చరించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెంట్రల్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి, వైసీపీ అవినీతి అరాచకాలకు సహకరించిన కొంత మంది అధికారులు రాష్ట్రం నుంచి పారిపోవాలని యత్నిస్తున్నారని, వారి ప్రయత్నాలను గవర్నర్‌కు చెప్పి అడ్డుకట్ట వేయించామన్నారు. తప్పు చేసిన అధికారులను ఎవరి వదిలిపెట్టేది లేదని, వారి అరాచకాలు, అవినీతి బయట పడుతుందన్న భయంతో ఈ-ఆఫీసు, ఫైబర్ నెట్, ప్రభుత్వ కార్యాలయాల్లో కీలక ఫైళ్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎక్కడైతే ప్రభుత్వానికి సంబంధించిన కీలక సమాచారం ఉందో అక్కడ పోలీసులతో భద్రత కల్పించాలని గవర్నర్ ఆదేశించారన్నారు. 1400 మంది టీచర్లకు బదిలీల ఆర్డర్ ఇచ్చారని, ఎన్నికల దృష్ట్యా అది కుదరలేదన్నారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న వారికి బదిలీలు చేశారన్నారు. మరో 30 మంది స్టాఫ్ నర్సులకు పోస్టింగ్ సిద్ధమైనట్లు తెలిసిందన్నారు. నర్సింగ్ పోస్టింగ్‌లలోను అవినీతి ఉందని తెలిసిందన్నారు. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఏపీబేవరేజ్ కార్పొరేషన్ ఎండీ, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ తదితర అధికారులు ఇక్కడ ఉండేందుకు భయపడి మాకు డిప్యుటేషన్ వద్దని... వెళ్లిపోతామని లేఖలు పెట్టుకున్నారన్నారు. ఇప్పటివరకు వైసీపీతో అంటకాగిన కొందరు అధికారులు తప్పించుకోలేరని హెచ్చరించారు.

వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయుల మే నెల వేతనాలు జూన్ ఆరో తేదీ వచ్చినప్పటికీ ఇంకా మంజూరు కాలేదని, తక్షణమే అధికారులు ఏర్పాట్లు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌంటింగ్ అనంతరం ప్రభుత్వ మార్పిడి జరిగిందని, ఈ నెల 12న నూతన ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని, వేతనాల కోసం ఆర్థిక శాఖ అధికారులతో సమాచారం కోసం ప్రయత్నిస్తే ఎవరూ స్పందించడం లేదన్నారు. లక్షలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతనాలు మంజూరు చేసే బాధ్యత ఎవరికి వుందో అర్థం కాని పరిస్థితి అన్నారు. సంబంధిత అధికారులు మే నెల వేతనాలను తక్షణమే మంజూరుకు కృషి చేయాలని కోరారు.

గొప్ప పోరాటయోధుడు 'చంద్ర'

జయంతి సభలో సీపీఐ ప్రముఖుల ఘననివాళి

విశాలాంధ్ర-గుంటూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, భూపోరాటయోధుడు, అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతిని సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు రావుల అంజిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పచ్చల శివాజీ, ఆకిటి అరుణ్ కుమార్, నగర కార్యవర్గ సభ్యుడు జి.సురేశ్‌బాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియదాస్, నూతలపాటి చిన్న, దుపాటి రత్నం, చెవుల పున్నయ్య, ఇ.వెంకటేశ్వరరావు, పి.జగన్నాథం, రాగం నాగరాజు, యోగయ్య, రాయల వెంకటేశ్వర్లు, బాలయ్య, కూరాకుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ విధ్వంసం ఆపండి

ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించండి

గవర్నర్‌కు జగన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పచ్చమూకల ఆగడాలను అడ్డుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ప్రభుత్వ-ప్రైవేట్ ఆస్తులకు రక్షణగా నిలవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గవర్నర్‌కు జగన్ లేఖ రాశారు. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలు వంటి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను టీడీపీ మూకలు ధ్వంసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొందని, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ ముఠాలు స్వైరవిహారం చేస్తున్నాయని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిం దన్నారు. టీడీపీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయిందన్నారు. ఐదేళ్లు పటిష్ఠగా ఉన్న శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని జగన్ విమర్శించారు. ప్రతి వైసీపీ కార్యకర్తకు, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.

సీజేఐకి బాధితుల లేఖ

ఓట్ల లెక్కింపు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణుల అధ్వర్యంలో వైసీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి బాధితులు లేఖ రాశారు. తగిన ఆధారాలతో సహా సీజేఐకి బాధితులు వివరించారు. ఏలూరు జిల్లా నూజివీడులో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ గిరీశ్‌పై కత్తులతో దాడికి పాల్పడ్డారు. పోలీసుల అక్కడే ఉన్నప్పటికీ... అల్లరిమూకలను అదుపు చేయలేకపోయారు. ఇదేవిధంగా అన్ని జిల్లాల్లోను దాడుల పరంపర కొనసాగుతోంది. దాడులు అదుపు చేసి, తమకు రక్షణ కల్పించాలని సీజేఐకు విజ్ఞప్తి చేశారు.

గవర్నరుకు వైసీపీ నేతల ఫిర్యాదు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులపై టీడీపీ, జనసేన చేస్తున్న దాడులను అడ్డుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వైసీపీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు గురుమూర్తి, తనూజ, రాజ్యసభ సభ్యులు ఎస్.నిరంజన్‌రెడ్డి, నాయకులు పేర్ని వెంకట్రామయ్య(నాని), బాలాజీ తదితరులు కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ సానుభూతి పరులే లక్ష్యంగా దాడులకు దిగుతున్నారని తెలిపారు. అనంతరం ఇదే అంశాలతో రాష్ట్రపతికి, రాష్ట్ర డీజీపీకి లేఖల ద్వారా వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దాడులకు సంబంధించిన వార్తా క్లిప్పింగ్‌లను ఫిర్యాదుతోపాటు జతచేశారు. అనంతరం పేర్ని నాని మాట్లాడుతూ, వైసీపీ సానుభూతి పరులతోపాటు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు హింసాత్మక చర్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ దాడులు మరింతగా కొనసాగే అవకాశముందని, తక్షణమే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు.

పూలు, స్వీట్లతో జగన్ ఇంటికి...

రైతులను అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏపీ రాజధాని అమరావతి రైతులు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నివాసానికి వెళ్లే ప్రయత్నం చేయగా... పోలీసులు అడ్డుకున్నారు. గురువారం స్వీట్లు, పూలబొకేలతో జగన్ నివాసం వద్దకు చేరుకున్న మహిళా రైతుల్ని పోలీసులు నిలువరించారు. జగన్ నివాసం వద్ద నుంచి వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల విజ్ఞప్తి మేరకూ రైతులు వెనుదిరిగారు. అయిత తమతో పాటుగా తెచ్చిన స్వీట్లు, పూలబొకేలను పోలీసులకు ఇచ్చి వెళ్లిపోయారు.

భారీ వర్షం... రోడ్లు జలమయం

విశాలాంధ్ర-హైదరాబాద్: నగరంలో చాలా ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, ఈఎస్ఐ, యూసఫ్‌గూడ, బోరబండ, పంజాగుట్ట, ఖైరతాబాద్, బషీర్‌బాగ్, కోఠి, అబిడ్స్, ముషీరాబాద్, చిక్కడపల్లి, ఫిలింనగర్, కవాడిగూడ తదితర ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ సిబ్బంది వరదనీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టారు. భారీ వర్షానికి వాహనదారుల, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలతో పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. శుక్రవారం, శనివారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణకేంద్రం సంచాలకులు వివరించారు.

చిత్తశుద్ధితో ముందడుగేస్తాం

పవన్ కల్యాణ్ 'థ్యాంక్స్ పోస్ట్'

విశాలాంధ్ర-హైదరాబాద్: తన గెలుపుపై స్పందించి, శుభాకాంక్షలు చెప్పిన ప్రతిఒక్కరికీ జనసేన అధినేత, నటుడు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. తాము అందుకున్న విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. 'సార్వత్రిక ఎన్నికల్లో జనసేన సాధించిన అఖండ విజయాన్ని అభినందిస్తూ చాలామంది శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. రైతులు, కార్మికులు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక వేత్తలు, విద్యావంతులు, మేధావులు, మహిళలు, యువత.. ఇలా అందరూ ఈ విజయంపై సంతోషాన్ని వ్యక్తంచేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ప్రముఖ కథానాయకులు, నటులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు చెప్పారు. తెలుగుతోపాటు తమిళ్, కన్నడ, హిందీ చిత్ర పరిశ్రమలకు చెందిన శ్రేయోభిలాషులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సాధించిన విజయాన్ని స్వాగతిస్తూ అభినందనలు తెలిపిన ప్రతిఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ విజయం మా అందరిపై బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో ముందడుగు వేస్తాం' అని అన్నారు.

చిరంజీవిని కలిసిన పవన్

పవన్ కల్యాణ్ గురువారం తన సోదరుడు చిరంజీవిని కలిశారు. దిల్లీలో ఎన్‌డీఏ సమావేశంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వచ్చిన పవన్...మెగాస్టార్ చిరంజీవి దీవెనల కోసం చిరు ఇంటికి చేరుకున్నారు. అన్నయ్యను ఆత్మీయ ఆలింగనం చేసుకుని కాళ్లపై పడి నమస్కరించారు. చిరంజీవి భావోద్వేగంతో పవన్‌ను ఆలింగనం చేసుకున్నారు. పూలమాలతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కల్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 21 ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాల్లో జనసేన విజయం సాధించింది.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 7

విశాలాంధ్ర-కడప: అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగులో డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందనీ సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా ఆరు సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ ఏడవ సీజన్ ఈ నెల తొమ్మిదిన సాయంత్రం ఆరు గంటలకు, ప్రతి ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రసారమవుతుందన్నారు. భావోద్వేగంతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ 'మేఘసందేశం' సోమవారం (10వ తేదీ) నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు ప్రసారం కానున్నదన్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ ఏడుకు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

సంపాదకీయం

ఓటమి భారం యోగీదే!?

కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న ఏ పక్షానికైనా, లేదా నాయకుడికైనా ఉత్తరప్రదేశ్ లో విజయమే సోపానం అన్న భావన మొదటినుంచీ ఉంది. ఇంతవరకు ప్రధానులుగా ఉన్న వారిలో సగంమంది ఉత్తరప్రదేశ్‌నుంచి పార్లమెంటుకు ఎన్నికైనవారే. మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్న మోదీ కూడా ఉత్తరప్రదేశ్ లోని వారణాసినుంచి ఎన్నికైన వారే. కానీ నానా యాతనపడి మూడోసారి మోదీ ప్రధానమంత్రి అవుతున్నప్పటికీ ఉత్తరప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు బీజేపీని గట్టి దెబ్బే తీశాయి. ఉత్తరప్రదేశ్ లో "ఇండియా" ఐక్య సంఘటనకు ఒక్కసీటు కూడా రాదు అని మోదీ శపించారు. కానీ ఆ శాపం ఆయనను, ఆయన పార్టీనే దెబ్బ తీసింది. ఉత్తరప్రదేశ్‌లో 2019లో బీజేపీ 62 స్థానాలు గెలుచుకుంది. మిత్రపక్షాలతోకలిసి ఈసారి కనీసం 75 స్థానాలు అయినా సంపాదించ దలచుకుంది. కానీ 33 సీట్లు మాత్రమే సాధించగలిగింది. "ఇండియా" ఐక్య సంఘటన 43 స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీకి పోలైన ఓట్లు కూడా ఏకంగా 8శాతం తగ్గాయి. ఎనిమిది శాతం ఓట్లు తగ్గడం అంటే చాలా పెద్ద విఘాతమే. ఈ సారి బీజేపీ సొంతంగా 36 స్థానాల్లో గెలిస్తే బీజేపీ మిత్రపక్షాలైన ఆర్.ఎల్.డి.కి రెండు సీట్లు, అప్నాదళ్ కు ఒక్క స్థానం దక్కింది. ఇంతటి ఘోర పరాజయానికి కాలికి బలపం కట్టుకుని ఎన్నికల ప్రచారం చేసిన మోదీ, అమిత్ షా బాధ్యత వహిస్తారా? ఆ అవకాశమే లేదు. తప్పు ఒప్పుకునే శక్తి వారిద్దరికీలేదు. మోదీ రెండో సారి ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో ఉత్తరప్రదేశ్ నుంచి వారణాసి నుంచి గెలిచిన ప్రధాన మంత్రి మోదీని లెక్కవేయకపోయినా పదకొండుమంది మంత్రులుండే వారు. వీరిలో సొంత ప్రచారంలో ఆరితేరిన స్మృతి ఇరానీ, హిందుత్వ పరిరక్షకురాలనుకునే సాధ్వీ నిరంజన్ జ్యోతి పటేల్, మహేంద్ర్ అనాథ్ పాండే, సంజయ్ బలియాన్, భానూ ప్రతాప్ సింగ్ వర్మ, కౌశల్ కిశోర్, అజయ్ మిశ్రా తేనీ ఓడి పోయారు. అజయ్ మిశ్రా తేని కుమారుడే రైతుల మీంచి వాహనం నడిపి నలుగురైదురి ప్రాణాలు బలిగొన్నారు. ఉత్తరప్రదేశ్ లో బీజేపీ పరువు నిలిపిందల్లా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కూర్మీల నాయకుడు పంకజ్ చౌదరి, ఎస్.పి. బగేల్, బీజేపీ మిత్రపక్షమైన అప్నా దళ్ నాయకురాలు అనుప్రియా పటేల్ మాత్రమే. వీరంతా తమ సొంత బలం మీద గెలిచారు తప్ప మోదీ, అమిత్ షా ప్రచార ప్రభావంవల్ల మాత్రం కాదు. అయితే ఓటమికి బాధ్యత ఎవరిదో లేక ఏ అననుకూల పరిణామాలవల్ల ఓడమో బేరీజు వేసే ప్రయత్నం అన్ని రాజకీయ పార్టీలు చేస్తాయి. అందుకే ఉత్తరప్రదేశ్ బీజేపీ విభాగం అధ్యక్షుడు భూపేంద్ర చౌదరీని ఢిల్లీ పిలిపించారు. ఆయన నివేదిక వచ్చిన తరవాత బీజేపీ అధినాయకత్వం ఒక అవగాహనకు రావొచ్చు. ఓటమినెపం ఎవరిమీద పడుతుందో తెలియదు. అగ్రనాయకులైన మోదీ, అమిత్ షా మాత్రం ఓటమిలో తమ పాత్ర ఎంతో అంగీకరించరు. ప్రధాన ప్రచార బాధ్యతలు ఎవరికీ అప్పగించినా ముఖ్యమైన బాధ్యత ముఖ్యమంత్రిదే.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఘోర పరాజయానికి కొన్ని మౌలిక కారణాలు న్నాయంటున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ స్వరూపమే మార్చేస్తారని, అట్టడుగు వర్గాల వారికి వర్తిస్తున్న రిజర్వేషన్లకు మంగళం పాడతారని బడుగు జీవులు భావించారు. అయోధ్యలో రామ మందిరం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన లల్లన్ సింగ్‌తో పాటు, రామాయణం టీవీ సీరియల్‌లో రాముడి పాత్ర పోషించిన అరుణ్ గోవిల్, కర్నాటక బీజేపీ నాయకుడు హెగ్డే తమకు 400 కన్నా ఎక్కువ స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ఊదరగొట్టారు. రాజ్యాంగాన్ని మార్చే ఆలోచన లేదని మోదీ ఇచ్చిన హామీని ఉత్తరప్రదేశ్ ఓటర్లు నమ్మినట్టు లేదు. బీజేపీ రహస్య ఎజెండా గురించి రెండవ శ్రేణి నాయకులు అనుకూలంగా మాట్లాడుతూఉంటే జనాన్ని ఊరడించడానికి అగ్ర నాయకులు అలాంటిదేమీ లేదు అని చెప్పడం, ఆ తరవాత రెండోశ్రేణి నాయకులు చెప్పిందే అమలై పోవడం దేశ వాసులకు అనుభవమే. అందుకే మోదీ మాటను నమ్మలేదు. జనజీవన సమస్యలు ఈ ఎన్నికల క్రమంలో ప్రస్తావనకు రాకుండా మోదీ చాలా జాగ్రత్త పడ్డారు. ఈ సమస్యలనే ప్రతిపక్ష పార్టీలు ప్రముఖంగా ఎత్తి చూపాయి. మోదీ వీటికి సమాధానాలు చెప్పక తప్పలేదు. కానీ ఆ సమాధానాలు అనుమాన నివృతి చేయలేదు. మోదీ ఇచ్చిన సమాధానాలన్ని ఆధ్యాత్మిక పరిభాషలోనే ఉన్నాయి. ప్రతి సమాధానంలోనూ మోదీ స్వోత్కర్షే కొట్టొచ్చినట్టు కనిపించింది. తాను తల్లి గర్భంలోంచి పుట్టలేదన్న అభిప్రాయం ఆమె మరణం తరవాత కలిగిందని, ఈ దేశోద్ధరణకు భగవంతుడే తనను పంపించాడని, అందువల్ల తాను కారణ జన్ముడినని చెప్పుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంగళ సూత్రాలు కూడా లాగేసుకుంటారని మోదీ నేలబారు ప్రచారానికి దిగజారారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని పాకిస్థాన్ కోరుకుంటోందన్న విపరీత ప్రచారానికి మోదీ వెనుకాడలేదు. మోదీ ఇచ్చిన సమాధానాలు ఏవీ ప్రజలకు సంతృప్తి కలిగించలేదు. పైగా అసలు విషయాల నుంచి తమను పెడదారి పట్టిస్తున్నారని కూడా జనం భావించారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రమే తమ సమస్యలను లేవనెత్తుతున్నాయన్న విశ్వాసం ప్రజలకు కలిగింది. ఈ ధోరణి ఒక్క ఉత్తరప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైంది కాదు. దేశమంతటా బీజేపీపై ఇలాంటి అభిప్రాయమే ఉంది. అందుకే బీజేపీ బలం కుంచించుకు పోయింది. మరో ప్రబలమైన కారణం అభ్యర్థుల ఎంపిక సవ్యంగా లేకపోవడం. అంతకు ముందు ఎంపీలుగా ఉన్న అనేకమందిపై ప్రజలలో విపరీతమైన అసంతృప్తి ఉంది. అయినా వారిని మార్చకుండా కొనసాగించారు. ఇది విజయావ కాశాలను బాగా దెబ్బతీసింది. ముఖ్యమంత్రి యోగీ పరిపాలనా విధానం ప్రజలను ముప్పు తిప్పలు పెట్టింది. నేరాలను అదుపు చేస్తున్నామనే మిషతో బూటకపు ఎన్‌కౌంటర్లు, బుల్‌డోజర్లతో అనేక మంది ఇళ్లను ధ్వంసం చేయడం జనాన్ని అతలాకుతలం చేసింది. "రాం, రేషన్, రాష్ట్రవాద్" అన్న యోగీ నినాదం పెద్దగా ఆకట్టుకోలేదు. రామమందిర నిర్మాణం భక్తి ప్రపత్తులు ఉన్న వారికి ఆనందం కలిగించి ఉండొచ్చు కానీ వాళ్లందరూ బీజేపీకి ఓటు వేయాలని కంకణం కట్టుకున్న దాఖలాలు లేవు. ఉచిత రేషన్ సదుపాయం దీర్ఘకాలం కొనసాగితే ప్రజలు అది తమ హక్కుగా భావిస్తారు. అది ప్రభుత్వం ఔదార్యం అని భావించలేదు. బీజేపీ చెప్పే జాతీయతావాదం ఎప్పుడూ పేలని తూటనే. అయితే ఓటమికి ఎవరో ఒకరు బలిపశువు కావాల్సిందే. యోగీ ఆదిత్యనాథ్‌ను ముఖ్యమంత్రి పదవినుంచి తొలగించాలన్న ప్రయత్నాలు అమిత్‌షా లోపాయికారీగా చేస్తూనే ఉన్నారు. మోదీ తరవాత ప్రధాన పదవికి యోగీ ఆదిత్యనాథ్ కూడా బలమైన ప్రత్యర్థే. అమిత్ షా బాధా అదే. ఓటమి భారం యోగీ పైనే పడేస్తారేమో!

బీజేపీని అడ్డుకున్న రాహుల్, అఖిలేష్

ప్రదీప్‌కుమార

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఉధృతిని బీజేపీ విజయాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్, సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్‌లు ఎంతో చాకచక్యంగా అడ్డుకున్నారు. దేశ బీజేపీ నాయకత్వం కుదేలైంది. 2024లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో మెజారిటీ సాధించలేకపోయింది. 80 నియోజకవర్గాలున్న యూపీలో 2019 ఎన్నికల్లో బీజేపీ 62సీట్లను గెలుచుకుంది. తిరిగి 62 సీట్లు లేదా అంతకంటే ఎక్కువగా గెలవాలని ప్రధాని మోదీ ఎంతో ఆశపెట్టుకున్నారు. అటు మోదీ ప్రభుత్వం, ఇటు యోగీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడంలో విఫలమైనారన్న అభిప్రాయం రాష్ట్ర ప్రజలలో గణనీయంగా ఏర్పడింది. ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని రాహుల్, అఖిలేష్ యాదవ్‌లు విస్తృతంగా సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించి బీజేపీ ప్రభుత్వాలు సాధించిన అరాచకాలను, అవకతవకలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. మరోవైపు ప్రియాంక గాంధి, డింపుల్ యాదవ్‌లు కూడా సంయుక్తంగా ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించి ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రజలను సమీకరించారు. వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలను (పీడీఏ) సమీకరించాలని అఖిలేష్ యాదవ్ వ్యూహాన్ని రూపొందించారు. ఈ వ్యూహం చక్కగా పనిచేసింది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమికి ఓటు వేయాలని రాహుల్, అఖిలేష్ యాదవ్‌లు చేసిన ప్రచారం ఫలించింది. మరోవైపు బహుజన సమాజ్ పార్టీ(బిఎస్‌పి) ఒంటరిగా పోటీచేసింది. ఒక్కసీటు కూడా గెలవలేదు. పైగా 2019లో 19శాతం ఓట్లు రాగా ఈసారి 9శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

2019లో సమాజ్‌వాది పార్టీతో కలిసి బిఎస్‌పీ నేత మాయావతి పోటీ చేయగా, అంతకు ముందు ఒక్క సీటు కూడా లేని పార్టీ ఈ ఎన్నికల్లో 10సీట్లు గెలుచుకుంది. ఈ సారి కాంగ్రెస్, ఎస్‌పీలకు దూరంగా ఉంది. మాయావతి మేనల్లుడు ఆకాష్ ఆనంద్ పార్టీలో రెండో స్థానంలో ఉన్నారు. సీతాపూర్‌లో బీజేపీ ర్యాలీపైన తీవ్ర విమర్శ చేయడంతో ఆయనను పార్టీనుంచి తొలగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ 38సీట్లను గెలుచుకుంది. గతంలో ఆ పార్టీకి 5సీట్లు మాత్రమే ఉన్నాయి. యూపీలో ఇండియాకూటమి 44సీట్లు గెలుచుకుంది. లోక్‌సభలో మూడవ పెద్దపార్టీగా సమాజ్‌వాది నిలిచింది. అలాగే ఈ పార్టీ ఓట్ల శాతం 2018లో 19.1ఉండగా, అది ఈ సారి 33.6శాతానికి పెరిగింది. 2004లో సమాజ్‌వాది 30సీట్లు గెలుచుకుంది. అయితే ఆనాడు ములాయంసింగ్ యాదవ్ నాయకత్వంలో పార్టీ పోటీ చేసింది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు మోదీ, యోగీ ప్రభుత్వాల పాలనలో ఘోరంగా విఫలమయ్యాయని ప్రజలు భావించారు. రాష్ట్రంలో తక్కువ స్థానాలను గెలుచుకోవడం వల్ల ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను తప్పించి మరొకరిని నియమించే అవకాశమేలేదు. అయోధ్యలో సమాజ్‌వాదిపార్టీ అభ్యర్థి అవదేశ్‌ప్రసాద్ గెలవడం బీజేపీ అభ్యర్థి లల్లూసింగ్ ఓడిపోవడంతో పార్టీ నాయకత్వం తలవంచుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. రామాలయం నిర్మాణంతో పార్టీ ప్రతిష్ట పెరిగి ఈ సారి మరిన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుంటామని బీజేపీ ఆశించగా పరిస్థితి తల్లకిందులైంది. దీనితో బీజేపీ నాయకత్వం అవమానానికి గురైంది. ఏడుగురు కేంద్రమంత్రులు -సంజీవ్ బలియాన్, మహేంద్రనాథ్ పాండే, స్మృతిఇరానీ, కౌశల్‌కిషోర్, భానుప్రతాప్‌సింగ్, అజయ్‌మిశ్రాసేని, సాధ్వి నిరంజన్ జ్యోతి ఓడిపోయారు.

రాహుల్‌గాంధీ రాయ్‌బరేలి నుంచి మంచి మెజారిటీతో గెలుపొందారు. ఆయన సన్నిహిత మిత్రుడు కిశోరిలాల్ శర్మ అమేఠీలో కేంద్రమంత్రి స్మృతిఇరానీని ఓడించారు. సుల్తాన్‌పూర్‌లోనూ, మేనకగాంధీని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. 2019లో కాంగ్రెస్ ఒకసీటును గెలుచుకోగా, ఈ సారి ఆ సంఖ్యను ఆరుకు పెంచుకున్నారు. అలాగే ఓట్ల శాతం 6.4నుంచి 9.5శాతానికి ఈ సారి పెరిగింది. మేనకాగాంధీ ఆమె కుమారుడు వరుణ్‌గాంధీలకు ఈసారి పిలిభిత్ నుంచి పోటీచేయడానికి బీజేపీ టిక్కెట్ ఇవ్వలేదు. వరుణ్‌గాంధీ ఈ డబుల్‌ఇంజన్ ప్రభుత్వాల విధానాలను తీవ్రంగా విమర్శిస్తారు. యూపీలో ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాల నైతిన విజయాన్ని మరింతగా పెంచింది. ప్రత్యేకించి కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల ప్రతిష్ట పెరిగింది. ఇండియా బ్లాకు మరో 40,50సీట్లకుపైగా గెలిచి ఉన్నట్లయితే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి మోదీ ప్రభుత్వం సాగించిన దుర్మార్గపాలనను చక్కబరిచే అవకాశం ఉండేది.

మోదీ-షాపై సంఘ్ ఆగ్రహం

అరుణ్ శ్రీ వత్సవ

మూడోసారి ప్రధానమంత్రిగా ఈ నెల తొమ్మిదో తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నట్లు మోదీ చేసిన ప్రకటన భక్తులను సంతోషపరిచింది. అదే సమయంలో ఆర్ఎస్ఎస్ ఉన్నత స్థాయి నాయకులు ఇది తమను అవమానించినట్లుగా ఉందని సంస్థపేరుకూడా చెడగొడుతున్నదని తీవ్ర ఆగ్రహం వ్యక్తపరచారు. మోదీ అహంభావిగా తయారవడానికి ఎవరోకాదు...ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కారణమని అన్నారు. కాషాయ ప్రభుత్వాన్ని నడిపించేవాడినే ఆర్ఎస్ఎస్ సాధారణంగా ఎన్నుకుంటుంది. గోవాలో జరిగిన ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసింది. 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తానని ప్రకటించడం ద్వారా మోదీ ఆర్ఎస్ఎస్ నాయకత్వాన్ని సవాలు చేశారు. కొత్త ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేయలేదు. కనీసం పార్టీ కార్యవర్గం ఎన్‌డీఏ కొత్తనాయకుడిని ఎంపిక చేయలేదు. పార్టీ అధికారనియమ, నిబంధనలను మోదీ పూర్తిగా ఉల్లంఘించారు. అన్నిటికంటే ఆశ్చర్యంకలిగించే విషయం ఏమంటే, మోదీ ప్రమాణస్వీకారంచేసే తేదీని ఆయనే ఎంచుకున్నారు. దీనివెనుక గుజరాత్ లాబీ బాగా పనిచేసిందని ఆర్ఎస్ఎస్ నాయకులు విశ్వసిస్తున్నారు. గుజరాత్‌కు చెందిన మోదీ, అమిత్ షాల నాయకత్వంలో అక్కడి నాయకులు పార్టీని ఆదేశించే పాత ఆటను మళ్లీ ఆడుతున్నారు.

అహంకారం, నిరంకుశత్వం, దుష్టపాలన మూలంగా అత్యంత నాశిరకమైన ఫలితాన్ని పొందామని ఏ మాత్రం సిగ్గుపడటంలేదని మోదీ, అమిత్ షాలను విమర్శించారు. గత పదేళ్లకాలంలో జరిగిన కాషాయ పాలనలో పార్టీని హైజాక్ చేశారని సంఘ్‌పరివార్ నేతలు విమర్శిస్తు న్నారు. మళ్లీ పార్టీని హైజాక్ చేసేందుకు బరితెగించి ప్రయత్నిస్తున్నారు. అయితే బీజేపీ ప్రకటన తమ పనిని సమర్థించు కునేలాగా ఉంది. ప్రధానమంత్రి నివాస గృహంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో మోదీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తాము సక్రమంగా పనిచేశామని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని ప్రకటన పేర్కొంది. అంతేకాదు, బీజేపీ సీనియర్ నాయకుడు నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్‌లపై కూడా ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు జేపీనడ్డా సైతం మోదీ-షాలతో కలిసి పోయారని సంఘ్ నాయకులు పేర్కొన్నారు. నడ్డా-మోదీ-షాల చేతుల్లో రబ్బర్ స్టాంప్‌గా మారిపోయారు. ఆయన తప్పుదారి పట్టడానికి వీళ్లిద్దరే కారణమని ఆర్ఎస్ఎస్ నాయకులు అంటున్నారు. మొత్తం బీజేపీ నాయకత్వం మోదీ వెనుక ఉన్నారన్న అభిప్రాయాన్ని నడ్డా కలిగించారు. గందరగోళంగా ఉన్న నేపథ్యంలో 'ఏకగ్రీవంగా' అనే మాట ఆ ప్రకటనలో పేర్కొన్నారని వ్యంగ్యంగా సంఘ్‌పరివార్ వ్యాఖ్యానించింది. గుజరాత్ లాబీకి దాని స్థానం ఎక్కడా అనేది తప్పక చూపించాలని సంఘ్ భావిస్తోంది. పార్టీ ప్రయోజనంకోసం మాత్రమే అధికారం, పోస్టులు సాధారణంగా ఉండాలని సంఘ్ ఆశిస్తోంది. వారిని అదుపు చేయలేకపోతే పార్టీ నాశనమవు తుందని తిరిగి అది తలెత్తుకోలేదని పేర్కొంటున్నారు. షేర్ మార్కెట్ దారుణంగా పడిపోవడం, అదానీకి చెందిన అనేక మిలియన్ల విలువైన షేర్లు తుడిచిపెట్టుకుపోవడాన్ని ఆర్ఎస్ఎస్ నాయకత్వం తీవ్రంగా పరిగణిం చింది. ఈ పరిణామం ఆందోళనకరమైన సందేశాన్ని అందించిందని ఆర్ఎస్ఎస్ పేర్కొన్నది. బీజేపీ నాయకులు విశ్వాసాన్ని పొందడంలో మోదీ విఫలమయ్యారని, ఆయన నాయకత్వ నాణ్యత దిగజారిపోయిందని పేర్కొన్నారు.

నితీష్,బాబు డిమాండ్లు:

ఈ పరిస్థితిని గమనించిన ఎన్‌డీఏ భాగస్వాములు నితీష్, చంద్రబాబు నాయుడు తమకు కావలసిన పదవులు, నిధులకోసం అడగడానికి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. గుజరాతీ నాయకత్వంతో కొనసాగడం కష్టమేనని ఆలోచిస్తున్నారు. అంతేకాదు...అమిత్‌షాకు ప్రధానమైన పాత్రను లేదా మంత్రిపదవి ఇవ్వకూడదని షరతు పెడుతున్నారు. అమిత్‌షా తమను అవమానించడం, వేధించడం ఈ నాయకులు మర్చిపోలేకపోతున్నారు. అమిత్‌షా మూలంగానే చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లారు. బుధవారం జరిగిన సమావేశంలో ఎన్‌డీఏలోని నాయకులు కీలకమైన మంత్రి పదవులు, తమ రాష్ట్రాలకు రాయితీలను ఇవ్వాలని గట్టిగా కోరారు. పట్నా సెంట్రల్ యూనివర్సిటీకి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని 8ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌ను ఇప్పటికైనా నెరవేర్చాలని నితీష్ కోరారు. అలాగే రైల్వే, వ్యవసాయం, సమాచారశాఖ మంత్రి పదవులను తమకి ఇవ్వాలని నితీష్ కోరారు. ఆర్థికశాఖ, లోక్‌సభ స్పీకర్ పదవి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని చంద్రబాబునాయుడు కోరినట్లు తెలుస్తోంది. తాను బీహార్‌లో చేసినట్లుగా కులగణనను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కూడా నితీష్ కోరారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు 16 మంది, జేడీయూ ఎంపీలు 12 మంది, బీజేపీకి చాలా ముఖ్యంగా అవసరం. బీజేపీకి 240 సీట్లు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 272 సీట్లు అవసరం. 2018లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కేంద్రం నుంచి మరిన్ని నిధులు, గ్రాంట్లు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరగా, ప్రధాని వాటిని మంజూరు చేయడానికి ఇష్టపడకపోవడంతో ఎన్‌డీఏ నుంచి చంద్రబాబు వైదొలిగారు. మోదీ ఈసారి కూడా ఈ డిమాండ్‌లను అంగీకరించడానికి సిద్ధంగా కనిపించడంలేదు. నితీష్, చంద్రబాబు చేస్తున్న డిమాండ్‌లను బీజేపీ నాయకులు అంగీకరించేలా లేరు. గుజరాత్ లాబీ ద్వారా బీజేపీ నాయకులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. అందువల్ల ఇలాంటి కోర్కెలను అంగీకరించేలా లేరు. ఇప్పుడు తమ డిమాండ్లను నెరవేర్చుకోలేకపోతే ముందు ముందు కేంద్రం చెప్పినట్లు వినే పాత్రను పోషించవలసిందే. పరిస్థితి ఇలాఉంటే ఈ ఐదేళ్ల మాట్లాడకుండా ఉండవలసి వస్తుంది. కనీసం ఒక డజను మంది సీనియర్ నాయకులు గత మూడు దశా బ్దాలుగా వివిధ బాధ్యతలు నిర్వహించినవారు తమ అభిప్రాయాలను భగవత్‌కు చెప్పారు. పరిస్థితి ఇలాగేఉంటే, మోదీని బహిరంగంగానే వ్యతిరేకించే అవకాశం లేకపోలేదన్నారు. మోదీతో చర్చలు కఠినంగా సాగుతున్నాయని వీరు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కూడా మాట్లాడు తున్నారని తెలుస్తోంది. త్వరలో మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో మాట్లాడవచ్చుననికూడా తెలుస్తోంది. నితీష్, చంద్రబాబులకు ప్రధాన మంత్రి, ఉప ప్రధానమంత్రి పదవులను ఇవ్వడానికి కూడా కాంగ్రెస్ నాయకులు వెనుకాడడంలేదని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన కొంతమంది ముస్లిం నాయకులు కూడా మోదీ, షాలతో ఎలాంటి సంబంధం పెట్టుకోరాదని చంద్రబాబును హెచ్చరించారు.

వికటించిన రామాలయ ప్రచారం

పి.సుధీర్

ఆర్ఎస్ఎస్ హిందూత్వ పునరుజ్జీవనానికి ప్రతీక అయిన అయోధ్య, హిందూ హృదయసామ్రాట్‌గా పిలిచే మోదీ పిలుపునకు ప్రజలు స్పందించలేదు. అయోధ్య నుంచి 79 ఏళ్ల సీనియర్ దళిత నాయకుడు అవదేశ్ ప్రసాద్‌కు ఓటువేసి గెలిపించారు. ఒకేఒక్క దెబ్బలో, అయోధ్య ఓటర్లు రెండు భ్రమలను కొట్టారు. మోదీ రామమందిర ప్రతిష్ట హిందువులలో హిందుత్వ అభిరుచిని రేకెత్తించడంలో ఘోరంగా విఫలమైందని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. రెండవది, భారతదేశం హిందుత్వదేశమనే మోదీ అనే అపోహను కూడా బద్దలు కొట్టింది. ఈ రెండు లక్ష్యాలతో, జనవరి 22న అయోధ్యలో రామమందిర శంకుస్థాపనను మోదీ చేపట్టారు. కానీ నాలుగు నెలల్లోనే ఆ ఉత్కంఠకు తెరపడుతుందని కలలో కూడా ఊహించి ఉండరు. ఈ ప్రక్రియలో తనను తాను శ్రీరాముడి కంటే (రాముడు కాదు) గొప్పవాడిగా చూపించుకునే వీర ప్రయత్నం చేశాడు మోదీ. "జో రామ్ కో లాయేంగే, హమ్ ఉంకో లాయేంగే (రాముడిని తీసుకువచ్చిన వారిని మేము తీసుకువస్తాము)" అని మోదీ చేసిన నినాదం అయోధ్య వీధుల్లో గాల్లో కలిసిపోయింది.

ఈ ఎన్నికల పోరాటంలో దేశంలో కాషాయ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారనడంలో ఎట్టి సందేహంలేదు. అయితే స్వతంత్ర భారతదేశ చరిత్రలో, ఇది అతి ముఖ్యమైన పోరాటాలలో ఒకటని ఘంటాపథంగా చెప్పవచ్చు. భారత ప్రజలు తమ అభిప్రాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదని, ఆశ్రిత పెట్టుబడిదారుల వర్గ ప్రయోజనాలను పెంపొందించే ప్రభుత్వాలను ప్రజలు సహించరన్న సందేశాన్ని దేశం అంతటా ఈ ఎన్నికల ఫలితాల ద్వారా వ్యాపింపచేయగలిగారు. మోదీ రెచ్చగొట్టే మత ఉచ్చులో పడకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు మతపరమైన శాంతి, సామరస్యాన్ని కొనసాగించినందుకు భారతదేశ ప్రజలు, ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రజలను తప్పనిసరిగా అభినందించాలి. పట్టణ మేధావులు, విద్యావేత్తలు, దళితులు, పేదలు, శ్రామికవర్గాలను హిందుత్వవాదులు అమాయకులుగా పరిగణించకుండా ఉండాలనే హెచ్చరికకు ఇది సంకేతం. అయోధ్య నుండి "అబ్కీ బార్ 400 పార్" అనే మోదీ నినాదానికి ప్రజలు ప్రతిస్పందించకపోవడం మోదీ నాయకత్వాన్ని నిస్సందేహంగా తిరస్కరించారు. ఎన్నో ఆర్భాటాల మధ్య రామ మందిరాన్ని ప్రతిష్ఠించిన నాలుగునెలల్లోనే అయోధ్య సీటులో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అవదేశ్ ప్రసాద్ చేతిలో బీజేపీ ఓడిపోయింది. ఈ ఓటమి హిందుత్వ నాయకులకు చాలా బలమైన సంకేతాలను ఇచ్చింది.



భారతదేశంలోని హిందువులు మోదీ మతపరమైన ఎజెండాతో విసిగిపోయారనేది సుస్పష్టం. అయితే, బీజేపీకి 240 సీట్లు రావడం అంటే మోదీ విభజన రాజకీయాలవల్ల కొంత పట్టు ఇంకా అలాగే ఉందనిపిస్తోంది. అయినప్పటికీ, తాజా తీర్పు దేశ రాజకీయాల్లో రైటిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో తొలి దశగా చెప్పవచ్చు. 2019 విజయం తర్వాత ఆర్ఎస్ఎస్, మోదీ పూర్తిగా బిజెపితో కలిసి వెళతారనే అభిప్రాయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు పూర్తిగా తోసిపుచ్చాయి. 2019 ఎన్నికలలో విజయం సాధించడానికి, 40 మంది సీఆర్‌పీఎఫ్ సైనికులను చంపిన తతంగంలో మోదీ హస్తం ఉందనడంలో సందేహంలేదు. చనిపోయిన జవాన్ల పేరుచెప్పి ఓటువేయాలని కోరిన మోదీని దేశ ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారు. ఈ ఎన్నికల్లో, ప్రజలు, ముఖ్యంగా బీజేపీకి మూలాధారమైన హిందీ రాష్ట్రాల్లో మోదీ ప్రభావం ఉందని సంఘ్‌నమ్మలేదు. ఆర్ఎస్ఎస్, మోదీల్లో చాలా కాలంగా పెనవేసుకున్న జాతీయవాదం, మతం ముసుగు ఈసారి తొలగిపోయింది. దేశ వనరులపై కన్నేసిన బిలియనీర్లు, ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని గ్రహించారు. ప్రజలు ఎదురుదెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, వారితో భుజాలు కలిపి పోరుకు సిద్ధంగా ఉండాలని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో రిజర్వేషన్ ఎజెండా తెరపైకి వచ్చింది. 90 శాతం మంది ప్రజలలో ఈసారి కులం, రిజర్వేషన్లు రాజ్యమేలుతున్నాయి.

హిందూ సమాజం ఏకశిలా సదృశ్యమైనదికాదు. వర్గ, కులాల వారీగా విభజించబడింది. సమాజంలో అనేక ఉపవిభాగాలు ఉన్నాయి. హిందుత్వ వ్యాప్తికి ఇది ఒక పెద్ద అవరోధం. భారతీయ జనాభాలో దాదాపు 95 శాతం మంది వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు అలాగేఉన్నత కులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి వివిధ వృత్తుల్లో సమానప్రాతినిధ్యంలేదు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య ప్రస్తావించదగినది: "రాజకీయ నాయకులు అధికారాన్ని వెంబడిస్తూ, ప్రతి నిమిషాన్ని ఎలా సంపాదించుకోవాలో వెచ్చిస్తూ, రాజకీయ ఆలోచనలో స్పష్టత లేకుండా ఉన్నారు. మన జనాభాలో 90శాతం మందికి ప్రాతినిథ్యం కల్పించేందుకు కృషి చేయాలని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ పంథాను మార్చుకోవాల్సి వస్తుందన్నది వ్యాఖ్యానించారు. మోదీ ఒక అభద్రతా రాజకీయ నాయకుడు, ఆత్మ న్యూనతతో తానే భగవంతుడిననే కాంప్లెక్స్‌తో బాధపడుతున్నాడు. మోదీ తనజన్మ "జీవ సంబంధమైనది కాదు" కానీ "దేవుడు పంపినది" అని చెప్పుకోవడం అపహాస్యం పాలైంది. నిజానికి ఎన్నికల్లో గెలవాలనే తపనతో మాతృత్వాన్ని అవమానించాడు.

కొంతమంది నిపుణులు, విద్యావేత్తలు ఫలితాన్ని ఓటమిగా కాకుండా ఎదురుదెబ్బగా అంచనావేశారు. అయితే కొంతమంది భారతీయులు మళ్లీ మోదీని ఎందుకు కోరుకున్నారు? తిరిగి కోరుకుంటున్న భారతీయులు ఎవరు? స్పష్టంగా, ధనిక, ఎగువ మధ్యతరగతి పెట్టుబడిదారులు మోదీని నవభారత రక్షకుడిగా చూస్తున్నారు. భారత పాలకవర్గం స్వభావాన్ని నిశితంగా పరిశీలిస్తే, అది ప్రాథమికంగా మితవాదంఅని, భగవంతుడి ప్రతిరూపంగా ఉన్న పాలకుడికి ప్రాధాన్యతనిస్తుందని స్పష్టంగా తెలుస్తుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ధనవంతులు, పెట్టుబడిదారులు రాజ్యాన్ని తమ అధీనంలో ఉంచుకుంటున్నారు. 70వ దశకం ప్రారంభంలో బిహార్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు తమ ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం దళితులు పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. ఆ సంవత్సరం కూడా అగ్రవర్ణ భూస్వాములచే దళితులు, శ్రామికవర్గాల్లో పెద్ద సంఖ్యలో హత్యలు జరిగాయి. అప్పటినుంచి ఎన్నికల కాలంలో హత్యలు సర్వసాధారణంగా మారాయి. బిహార్ నుండి ఒక ఉదాహరణ సీపీఐ(ఎంఎల్) అర్రా, కరకత్ అనే రెండు స్థానాల్లో విజయం సాధించారు. ఈ రెండు ప్రాంతాలు అరవైల చివరలో, డెబ్బైల ప్రారంభంలో రైతాంగ సాయుధ పోరాటానికి సాక్ష్యం. వందలాది మంది నక్సల్ కార్యకర్తలు హతమయ్యారు. గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతాలు శాంతితో ఉన్నాయి. అయితే ఈసారి ఈ స్థానాల నుంచి సీపీఐ(ఎంఎల్) అభ్యర్థులు రాజకీయ దిగ్గజాలను ఓడించారు. వారిలో ఒకరు, అగ్రవర్ణాల అధికారానికి ప్రతీకగా నిలిచిన బిహార్ మాజీ హోం కార్యదర్శి, సీనియర్ కేంద్ర మంత్రి, బీజేపీకి చెందిన ఆర్‌కే సింగ్ అర్రా నుంచి ఓడిపోయారు.

అహంకారమే ఆ నలుగురి ఓటమికి కారణం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలలో ప్రధానమంత్రి మోదీ అహంకారంతో పాటు కొందరు బీజేపీ మహిళా నాయకుల పొగరు కూడా అణగింది. విద్వేషాన్ని పెంచి పోషించిన నేతల నోళ్లూ మూతపడాల్సిందే. 2019లో అమేథీలో రాహుల్ గాంధీని ఓడించానని విర్రవీగిన స్మృతి ఇరానీకి ఈ ఎన్నికలలో లక్షా అరవై ఏడు వేల 196 ఓట్ల తేడాతో ఓటమి చవి చూడవలసి వచ్చింది. 2019లో ఆమె రాహుల్ గాంధీని ఓడించినప్పుడు ఓట్ల తేడా కేవలం 55 వేలు మాత్రమే. స్మృతి ఇరానీ కేవలం ఓటమి పాలే కాలేదు. ఇంతవరకు కనీసం పంచాయతీ ఎన్నికలలో కూడా ఎన్నడూ పోటీ చేయని కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ చేతిలో ఓడిపోవలసి వచ్చింది. ఎన్నికల ప్రచార సమయంలో కిశోరీ లాల్ శర్మ చాలా అణకువగా, హుందాగా ప్రవర్తించారు. స్మృతీ ఇరానీ నడవడిక అందుకు పూర్తి విరుద్ధం.

మహారాష్ట్రలోని అమరావతి నుంచి 2019లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా విజయం సాధించిన నవనీత్ కౌర్ రాణా ఈసారి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బలవంత్ వాంఖడే చేతిలో 19,731 ఓట్ల తేడాతో ఓడిపోయారు. విద్వేష పూరిత ప్రకటనలు చేయడంలో ఆమె అన్ని పరిధులూ దాటారు. ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్లి రెచ్చగొట్టే రీతిలో మాట్లాడారు.

హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు లోక్‌సభ సభ్యుడైన సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ మీద పోటీకి దిగిన మొదటి రోజు నుంచీ బీజేపీ అభ్యర్థి మాధవీ లత జగడాలమారితనానికి ప్రతీకగా నిలిచారు. పోలింగ్ జరగడానికి ముందే తాను విజయం సాధించినట్టు నమ్మించడానికి ఆమె వదిలిన విమర్శనాస్త్రాలు, అసత్య ప్రచారాలు, పలికిన బీరాలు హైదరాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గంలో విపరీతంగా చర్చనీయాంశాలయ్యాయి. ఆమె నింపిన విద్వేషానికి అవధులే లేకుండా పోయాయి. అచ్చమైన తెలుగు మహిళల ఆహార్యం, అలంకరణతో ఆమె చాలా మందిని ఆకర్షించారు. ఆమె వేషధారణ, హావభావాలలో రెండు రకాలు వ్యక్తీకరణలు కనిపించాయి. ఆమె ఆహార్యం, ముఖకవళికలు ఉత్సాహంగా ఉన్న సమయంలో ఉత్సాహంగా...నిరాశ ఆవహించినప్పుడు మరోలా ఉండడం స్పష్టంగా కనిపించింది. పోలింగ్‌కు ముందు ఆమె ముస్లింలు అధిక సఖ్యలో ఉండే మొగల్‌పురాకు వెళ్లినప్పుడు తన మీద దాడి చేయడానికి ప్రయత్నించారని నిరాధార ఆరోపణ చేశారు. ఇంకోసారి అదే ప్రాంతంలో తనను చూడగానే ముస్లింలు పారిపోయారన్నారు. ఈ రెండింట్లో ఏది నిజమో... ఏది అబద్ధమో తెలియదు. సందర్భోచిత వ్యాఖ్యలలో మాత్రం మాధవీ లత అందరినీ మించిపోయారు.

పోలింగ్ జరిగిన రోజున ఆమె పోలింగ్ కేంద్రాలలోకి వెళ్లి బురఖా వేసుకుని ఓటు వేయడానికి వచ్చిన మహిళల బురఖాలు తొలగించి వారి ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. కేవలం భద్రతా సిబ్బంది, ఎన్నికల సిబ్బంది మాత్రమే గుర్తింపు కార్డులు తనిఖీ చేసే అవకాశం ఉంది. చివరకు ఒవైసీ చేతిలో 3,23,894 ఓట్ల తేడాతో ఓడిపోయారు. హైదరాబాద్ నియోజకవర్గంలో ఓటర్లు కేవలం తమ మతం ఆధారంగానే ఓటు వేయరని ఆమెకు తెలియదు. హిందువులందరూ బీజేపీకి ఓటు వేయరని, ముస్లింలు అందరూ కట్టగట్టుకుని ఓటేయరని ఆమె అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. కొందరు దళితులు, అత్యంత వెనుకబడిన వర్గాల వారు మజ్లిస్‌కు ఓటు వేస్తారు. వాస్తవాలతో నిమిత్తం లేకుండా మాధవీ లత బోలెడు అహం ప్రదర్శించారు. ఒకసారి ఎన్నికల ప్రచారంలో భాగంగా మసీదు వేపు బాణం ఎక్కుపెట్టి అభాసు పాలయ్యారు.

ఇందిరా గాంధీ రెండో కుమారుడు సంజయ్ గాంధీ మృతి తరవాత ఇందిర కుటుంబం నుంచి విడిపోయిన మేనకా గాంధీ బీజేపీ నాయకురాలు. ఆమె నాలుగు మంత్రివర్గాలలో పని చేశారు. మోదీ తొలి ప్రభుత్వంలోనూ ఆమె మంత్రే. కానీ ఆ తరవాత ఆమెకు మంత్రిపదవి దక్కలేదు. రెండుసార్లు ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ నియోజక వర్గం నుంచి ఎన్నికైన ఆమె... ఈ సారి కూడా అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి రాం భువల్ నిషాద్ ఆమెను ఓడించారు. ఆమె ఎప్పుడూ అహంకారపూరితంగానే ఉండేవారు. ఈసారి సుల్తాన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు ఆమె అహంకారానికి తగిన మందు వేశారు. సాధ్వి నిరంజన్ జ్యోతి పేరు చాలా మందికి తెలిసే ఉంటుంది. ఆమె మోదీ మంత్రివర్గ సభ్యురాలిగా ఉండేవారు. కానీ ఈసారి ఆమె ఫతేపూర్‌లో సమాజ్ వాదీ పార్టీ నాయకుడు నరేశ్ ఉత్తం చంద్ పటేల్ చేతిలో 33,199 ఓట్ల ఓడిపోయారు.

అహంకారం, విద్వేషం రెచ్చగొట్టే తత్వం ఉన్న వారు కొన్నిసార్లు ఎన్నికలలో విజయం సాధించవచ్చు. కానీ ఈ దఫా ఓటర్లు ఇలాంటి వారినందరినీ ఇంటి దారి పట్టించారు.

యూపీ ప్రజలకు సెల్యూట్: ప్రియాంక

న్యూఢిల్లీ: ప్రజల సమస్యలను విస్మరిస్తే ఏమవుతుందో దేశానికి తెలియజేసిన ఉత్తరప్రదేశ్‌కు సెల్యూట్ చేస్తున్నా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వ ఎన్డీయేకు చుక్కలు చూపించినందుకు ఉత్తరప్రదేశ్ ప్రజలను ఆమె ప్రశంసించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాంగ్రెస్ సహచరులకు సెల్యూట్ చేస్తున్నా అంటూ ఆమె 'ఎక్స్'లో తెలిపారు.'మీరు రేయింబవళ్లు శ్రమించడాన్ని చూశాను. మీరు ఎవరికీ తలవంచలేదు. ఎక్కడా ఆగలేదు. అతికష్టమైన పోరాటాన్ని ధైర్యంగా పోరాడారు. మీపై దురాగతాలు జరిగినా... తప్పుడు కేసులు పెట్టినా.... జైళ్లకు పంపినా... పదేపదే గృహనిర్బంధంలో ఉంచినా మీరెవరూ తలవంచలేదు. ఎందరో నేతలు భయంతో పారిపోయారు. మీరు మాత్రం పార్టీ కోసం, దేశం కోసం, రాజ్యాంగం కోసం ధైర్యంగా నిలబడ్డారు. అందుకే ఉత్తరప్రదేశ్‌లోని కాంగ్రెస్ సహచరులు అందరికీ సెల్యూల్ చేస్తున్నా' అని ప్రియాంక వెల్లడించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న స్పష్టమైన సందేశాన్ని దేశానికి ఇచ్చిన ఉత్తరప్రదేశ్ ప్రజలను చూసి గర్విస్తున్నానన్నారు. ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్న సిద్ధాంతాన్ని నేటి రాజకియాలకు గుర్తుచేశారని, ప్రజా సమస్యలను విస్మరిస్తే ఏం జరుగుతుందో చూపించారని ప్రియాంక పేర్కొన్నారు. ఎన్నికలు జరిగేవి ప్రజల కోసమని... ప్రజలదే పోరాటం, ప్రజలదే గెలుపన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా ఐక్య సంఘటన 43 స్థానాల్లో విజయం సాధించింది. మరోవైపు ఎన్డీయే 36 స్థానాలతో సరిపెట్టుకున్నది.

'ఐసీఈ'ని తిరస్కరించిన మహారాష్ట్ర: సూలే

పుణె: 'ఐసీఈ (ఆదాయపు పన్ను, సీబీఐ, ఈడీ), వాటి అణచివేత ధోరణిని మహారాష్ట్ర ఓటర్లు తిరస్కరించారని ఎన్‌సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే అన్నారు. బారామతి లోక్‌సభ స్థానం నుంచి ఎన్సీపీ అభ్యర్థి సునేత్ర పవార్‌పై గెలుపొందిన తర్వాత ఆమె పుణెకు మొదటిసారి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇండియా ఐక్య సంఘటన 'వేచి చూద్దాం' విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావల్సిన సంఖ్యాబలం లేకపోయినా, అందివచ్చే అవకాశాన్ని సద్వినియోగించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాజ్యాంగానికి ముప్పు వాటిల్లజేయడం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తారస్థాయికి చేరుకోవడాన్ని ఓటర్లు తిరస్కరించారని ఆమె చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఏకైక పెద్ద పార్టీ బీజేపీని రాష్ట్రపతి ఆహ్వానించారు కానీ 'ఇండియా' కూడా సిద్ధంగా ఉందన్నారు. తన గెలుపుకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, మహా వికాస్ అగాదీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు అందరీ సమ్మిళిత కృషి ఫలితమని సుప్రియా సూలే అన్నారు. కరువు, నీటి ఎద్దడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల నడుమ మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయని, ఈ విజయం తమ సమ్మిళిత బాధ్యతను మరింత పెంచిందన్నారు. కాగా, నగరంలోని మార్కెట్ యార్డ్ ప్రాంతంలోని తన కార్యాలయానికి చేరుకున్న సుప్రియా సూలేకు గజమాలతో, డప్పులతో ఘన స్వాగతం లభించింది. తొలుత ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూల మాల వేసి సుప్రియా సూలే అంజలి ఘటించారు.

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా: ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస బలవన్మరణాలు కొనసాగుతున్నాయి. చదువులో ఒత్తిడి కారణంగా ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తాజాగా మరో విద్యార్థిని తనువు చాలించింది. ఈ ఘటనతో కలిపి ఈ ఏడాది కోటాలో 9మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గతేడాది ఏకంగా 30 మంది వరకు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. తాజా ఘటన వివరాల్లోకి వెళితే... మధ్యప్రదేశ్‌లోని రేవాకు చెందిన బగీషా తివారీ (18) అనే యువతి తన తల్లి, సోదరుడితో కలిసి కోటాలోని జవహర్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ)కు సిద్ధమవుతున్న ఆమె కోటాలో కోచింగ్ తీసుకుంటోంది. అయితే, ఆమె మంగళవారం నీట్-యూజీ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత బుధవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడింది. తాను నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మహారావ్ భీమ్ సింగ్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థి మృతికిగల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ప్రముఖులకు వ్యతిరేక తీర్పు

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై దీపాంకర్ భట్టాచార్య

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి, దాని ప్రముఖ నేతలు నరేంద్రమోదీ, అమిత్‌షా, యోగి ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా ప్రజా తీర్పు వెలువడిందని సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. బీజేపీని దాని నాయకుల నాయకత్వాన్ని ప్రజలు తిరస్కరించారని, దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు నైతిక హక్కును ఈ పార్టీ కోల్పోయిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎన్నికల ప్రచారం కేవలం మోదీ జపంతోనే సరిపోయిందని దుయ్యబట్టారు. మోదీ ప్రతి చోటకు వెళ్లి నేను మీ ప్రధానిని అని చెప్పుకున్నారు కాబట్టి ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా ఓటేశారని ఫలితాలు స్పష్టంచేశాయని అన్నారు. దీపాంకర్ భట్టాచార్య తాజాగా పీటీఐకి ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ప్రధాని మోదీ, బీజేపీపై విమర్శలు గుప్పించారు. మోదీ, అమిత్‌షా, యోగి ఆదిత్యనాథ్‌కు వ్యతిరేకంగా ప్రజా తీర్పు వచ్చిందని, వారి జుమ్లాలు ప్రజలను ఆకర్షించలేదని వ్యాఖ్యానించారు. అయోధ్య రామాలయంపైనే ఎన్నికలు సాగుతాయన్న బీజేపీ అంచనాలు తారుమారయ్యాయని, అధిక ధరలు, నిరుద్యోగం వంటి ప్రజల వాస్తవ పరిస్థితులు ఈ ఎన్నికలను శాసించాయని, దీంతో బీజేపీకి ఏం చేయాలో పాలుపోలేదని, ఆ పార్టీ గందరగోళానికి గురైందని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. జీవనోపాధి, హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగ భవిష్యత్ వంటి అంశాలన్నీ ప్రజల అజెండాలో ఉన్నాయని, వాటి ఆధారంగానే ప్రజా తీర్పు వచ్చిందని చెప్పారు.

2019తో పోల్చితే సీట్లు పెరిగినప్పటికీ ఈసారి ఇంకాస్త శ్రమిస్తే ఇండియా ఐక్య సంఘటన మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వగలిగేదన్నారు. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల అనుభవాన్ని బట్టి ఈ ఎన్నికల్లో 50-50 తరహా పరిస్థితి ఉంటుందని... 20కుపైగా స్థానాల్లో గెలుస్తామని ఆశించినట్లు ఆయన చెప్పారు. ఉత్తర బీహార్‌లో సీట్ల సర్దుబాటు హేతుబద్ధంగా జరిగివుంటే మెరుగైన ఫలితాలు వచ్చేవన్నారు. బీహార్‌లోని మూడు స్థానాల్లో సీపీఐ(ఎంఎల్) పోటీ చేసిందని, వాటిలో రెండింటిని గెలుచుకుందని చెప్పారు. 'ప్రజలు దీనిని స్ట్రైక్ రేట్ అంటారు... మాకు బ్యాటింగ్ అవకాశాలు అరుదుగా వస్తాయి. చివరిలో వచ్చి ధోని తరహా మెరుపు బ్యాటింగ్ చేయడం మా వంతు అవుతోంది' అని క్రికెట్ భాషలో తమ పార్టీ పనితీరును దీపాంకర్ భట్టాచార్య వర్ణించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 19 స్థానాల్లో పోటీ చేయగా 12 చోట్ల గెలిచిందని తెలిపారు. ఈసారి ఆరా, కరాకత్ లోక్‌సభ స్థానాల్లో సీపీఐ(ఎంఎల్) గెలుచుకుందని, నలందాలో ఓడిపోయిందన్నారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత బీహార్‌లో రెండు ఎంపీ సీట్లు సీపీఐ(ఎంఎల్)కు వచ్చాయని చెప్పారు. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని ఆకాంక్షించారు.

లోక్‌సభ ఎన్నికల్లో 65.79 శాతం పోలింగ్

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో 65.79 శాతం ఓటింగ్ నమోదైంది. అయితే ఇందులో పోస్టల్ బ్యాలెట్‌లు లేనందున తుది గణాంకాలు మారవచ్చని ఎన్నికల సంఘం గురువారం తెలిపింది. ఇటీవలి విలేకరుల సమావేశంలో భారత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్... 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 67.40 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో భారతదేశంలో 91.20 కోట్ల మంది ఓటర్లు ఉండగా... వీరిలో 61.5 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 96.88 కోట్లకు పెరిగింది. 'మొత్తంమీద 2024 సార్వత్రిక ఎన్నికలలో అన్ని పోలింగ్ స్టేషన్‌లలో కలిపి 65.79 శాతం ఓటింగ్ నమోదైంది' అని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ శాతం అంటే ఈవీఎంలలో పోలైన ఓట్లు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి పోస్టల్ ఓట్ల సంఖ్య వచ్చిన తర్వాత వివరణాత్మక గణాంక నివేదికలు అందుబాటులోకి వస్తాయని ఎన్నికల సంఘం తెలిపింది.

ఏ ప్రభుత్వం వచ్చినా రైతులతో చర్చించాలి: తికైత్



నోయిడా: కేంద్రంలో ఎవరు కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా రైతులతో చర్చలు జరపాలని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకుడు రాకేశ్ తికైత్ పేర్కొన్నారు. ముజఫర్‌నగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'దేశంలో సమస్యలు ఉన్నప్పుడు ఆందోళన పుడుతుంది. ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేసినా కూడా వారు చర్చల కోసం ముందుకు రావాలని మేము కోరుకుంటున్నాము' అని తికైత్ అన్నారు. 2020-21లో మోదీ సర్కారు తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల రద్దుకు దేశవ్యాప్తంగా ఉద్యమించిన సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)లో బీకేయూ భాగంగా ఉంది.

ఇప్పుడు, అనేక రైతు సంఘాలు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న సంగతి విదితమే. తికైత్ మాట్లాడుతూ... 2021 జనవరి 22 తర్వాత గత ప్రభుత్వం రైతులతో మాట్లాడలేదని తెలిపారు. '2022, 2023లో రైతు సంఘాలతో చర్చలు జరగలేదు. ఇప్పుడు మనం 2024లో ఉన్నాము' అని ఆయన చెప్పారు. లోక్‌సభలో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించడంలో విఫలమవడంపై తికైత్ మాట్లాడుతూ... "బీజేపీ నేతలు తమ అభ్యర్థులను (యూపీలో) ఓడిస్తున్నారని మేము మీకు ముందే చెప్పాము... తమ పార్టీ అధికారంలోకి రావాలని వారు కోరుకున్నారు. ఎంపీలు ఓడిపోవాలి తద్వారా వారికి భవిష్యత్తులో టికెట్ వస్తుంది. ఇది అందరి ప్రణాళిక" అన్నారు. ముజఫర్‌నగర్, లఖింపూర్ ఖేరీ స్థానాల నుంచి పోటీ చేసి ఓటమి పాలైన బీజేపీ మంత్రులు సంజీవ్ బాల్యన్, అజయ్ మిశ్రా తేనిపై తికైత్ విరుచుకుపడ్డారు. 'గెలుపోటములు ఎన్నికలలో భాగం. కానీ దేశవ్యాప్తంగా ఇబ్బందులు ఉన్నాయి. ప్రజలు ఏమీ అనకుండా శిక్షిస్తారు. ప్రజలు నిశ్శబ్దంగా పని చేస్తారు' అని టికైత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్‌కుమార్ కీలక పాత్రపై మాట్లాడుతూ... నితీశ్‌కుమార్ 'నితీష్ కుమార్ తనకు లాభం చేకూర్చే ప్రతి చోటకు వెళ్తారన్నారు. దోపిడీలను దోచుకోవడం నేరంకాదని చెప్పారు.

లోక్‌సభలో సీనియర్ ఎంపీలు

ఇంద్రజిత్ గుప్తా రికార్డు పదిలం

న్యూఢిల్లీ: పార్లమెంటులో అడుగుపెట్టి... లక్షల మంది తరపున తమ గళాన్ని వినిపించే అవకాశం కొందరికే లభిస్తుంది. ఈ క్రమంలోనే తమ ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొంటూ... దశాబ్దాల పాటు లోక్‌సభకు ఎన్నికవుతోన్న నాయకులు ఎందరో ఉన్నారు. ఇంద్రజిత్ గుప్తా, వాజ్‌పేయి, కమల్‌నాథ్ వంటి దిగ్గజ నేతల నుంచి మేనకాగాంధీ, సంతోశ్‌కుమార్ గంగ్వార్ వంటి నేతలు దశాబ్దాల పాటు చట్టసభకు ప్రాతినిధ్యం వహించారు. 18వ లోక్‌సభలోనూ అడుగుపెడుతోన్న అత్యంత సీనియర్ల జాబితాను పరిశీలిస్తే...బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ లోక్‌సభలో అత్యంత సీనియర్ల జాబితాలో తొలిస్థానంలో నిలిచారు. 1996లో తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టిన ఆయన... వరుసగా ఎనిమిది సార్లు ఎంపీగా విజయం సాధించిన ఘనతను సొంతం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని టికమ్‌గఢ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన... 2019 ప్రొటెం స్పీకర్‌గా చేశారు. దళిత నేతల్లో ఒకరిగా ఉన్నారు. మోదీ కేబినెట్‌లో కేంద్ర సామాజిక న్యాయమంత్రిగా వ్యవహరించారు. సురేశ్ కొడికున్నిల్ కేరళలో కాంగ్రెస్ దిగ్గజ నేతల్లో ఒకరు. మావెలిక్కర పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎల్‌ఎల్‌బీలో పట్టా పొందిన ఆయన... విద్యార్థి దశలోనే రాజకీయ ప్రవేశం చేశారు. 27 ఏళ్ల వయసులోనే 1989లో అదూర్ నుంచి పోటీ చేసి తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఆ తర్వాత మవెళిక్కర నుంచి వరుసగా విజయం సాధిస్తున్నారు. తాజాగా ఎనిమిదోసారి గెలుపొందిన ఆయన 18వ లోక్‌సభలో అత్యంత సీనియర్లలో ఒకరిగా నిలిచారు. బీజేపీ నేతలు పంకజ్ చౌదరి (మహారాజ్‌గంజ్), జిగజినాగి రమేశ్ చందప్పా (బీజాపుర్), ఫాగన్ సింగ్ (మాల్డా), రాధా మోహన్ సింగ్ (పుర్వి చంపారన్), మన్‌సుఖ్‌భాయ్ ధాంజీభాయ్ (భరూచ్)తోపాటు డీఎంకే నేత టీఆర్ బాలు (శ్రీపెరంబదూర్) లోక్‌సభకు ఏడుసార్లు ఎన్నికైన నేతల జాబితాలో ఉన్నారు.

బీజేపీ నేతలు ఇంద్రజిత్ సింగ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, తృణమూల్ కాంగ్రెస్ నేత సుదీప్ బంధోపాధ్యాయ ఆరోసారి విజయం సాధించారు. హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా ఐదోసారి గెలుపొందారు. శిరోమణి అకాలీదళ్ నేత హర్‌సిమ్రత్ కౌర్, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నాలుగోసారి ఎన్నికైనవారిలో ఉన్నారు. వీరితోపాటు అనేక మంది ఎంపీలు ఆరు, ఐదు, నాలుగు, మూడుసార్లు విజయం సాధించిన వారిలో ఉన్నారు. 17వ లోక్‌సభలో అత్యంత సీనియర్ నేతలుగా ఉన్న మేనకా గాంధీ, సంతోశ్‌కుమార్ గంగ్వార్ (75) ఎనిమిది సార్లు ఎంపీలుగా గెలుపొందారు. తాజా లోక్‌సభ ఎన్నికలకు సంతోశ్‌కుమార్ దూరంగా ఉండగా... మేనకా గాంధీ ఓడిపోయారు. అంతకుముందు అనేకమంది దిగ్గజ నేతలు అనేకమార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించి చరిత్ర సృష్టించారు. సీపీఐ అగ్రనేత ఇంద్రజిత్ గుప్తా లోక్‌సభకు 11 సార్లు ఎన్నికై రికార్డు సృష్టించారు. ఆ రికార్డు ఇప్పటికీ చెరిగిపోలేదు. ఆయన 1960 నుంచి 2001 వరకు (1977లో మినహా) పశ్చిమబెంగాల్‌లో వివిధ లోక్‌సభ స్థానాల నుంచి 11 సార్లు ఎంపీగా గెలుపొందారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మొత్తం 10 సార్లు ఎంపీగా గెలుపొందారు. బలరాంపుర్, గ్వాలియర్, దిల్లీ నుంచి ఎంపీగా పనిచేసిన ఆయన... ఆ తర్వాత ఐదు పర్యాయాలు (1991-2009) లక్నో నుంచి ప్రాతినిధ్యం వహించారు. యూపీఏ-1 ప్రభుత్వ సమయంలో లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన సోమనాథ్ ఛటర్జీ... పదిసార్లు పార్లమెంటుకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేత పీఎం సయీద్ కూడా పదిసార్లు వరుసగా ఎంపీగా ఎన్నికై రికార్డు సృష్టించారు. 1967లో లక్షద్వీప్ లోక్‌సభ స్థానం ఏర్పాటైనప్పటినుంచి అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన.. 2005లో గుండెపోటుతో మరణించారు. కాంగ్రెస్ దిగ్గజ నాయకుల్లో ఒకరిగా ఉన్న కమల్‌నాథ్... తన కంచుకోటగా ఉన్న ఛింద్వాడా లోక్‌సభ స్థానం నుంచి తొమ్మిదిసార్లు పార్లమెంటు సభ్యుడిగా కొనసాగారు. సమతా పార్టీ వ్యవస్థాపకుడు జార్జ్ ఫెర్నాండెజ్ ఎనిమిది సార్లు గెలుపొందిన వారిలో ఉన్నారు.

పేదరికాన్ని బాగా తగ్గించాం: పట్నాయక్



భువనేశ్వర్: ఒడిశాలో నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల ఏకచత్రాధిపత్యానికి తెర పడింది. ఆ పార్టీని జనం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించారు. ఎమ్మెల్యేలతో బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ సమావేశమయ్యారు. తమ పార్టీ అధికారం చేపట్టేనాటికి ఒడిశాలో పరిస్థితులు దారుణంగా ఉండేవని గుర్తుచేశారు. 70 శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయని, ఇప్పుడు ఆ కుటుంబాలు 10 శాతానికి తగ్గాయని వివరించారు. 'గత 24 ఏళ్ల కాలంలో వ్యవసాయం, సాగునీటి రంగం, మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చాం. అయినప్పటికీ ఈసారి ప్రజలు తిరస్కరించారు. అందుకు మనం బాధపడాల్సిన అవసరం లేదు. ఇన్నాళ్లూ ప్రజల కోసం పనిచేశాం. ఇకపై కూడా ప్రజలకు అందుబాటులో ఉంటాం' అని నవీన్ పట్నాయక్ తమ ఎమ్మెల్యేలకు చెప్పారు. ఒడిశా అసెంబ్లీలో 147 స్థానాలు ఉన్నాయి. 78 సీట్లలో విజయం సాధించిన బీజేపీ అధికారం చేపట్టబోతుంది. బీజేడీ 51 సీట్లు గెలిచి ప్రతిపక్షానికి పరిమితమైంది. కాంగ్రెస్ 14 చోట్ల, సీపీఎం ఒకటి, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు.

మే నెలలో భానుడి భగభగలు

అత్యంత ఉష్ణమయ నెలగా రికార్డు

న్యూఢిల్లీ: భానుడి భగభగలతో మే నెలలో భూగోళం మండిపోయింది. భారత్‌పై ఉష్ణోగ్రతల ప్రభావం భారీగా పడింది. దీంతో అత్యంత ఉష్ణమయ నెలగా మే నిలిచింది. వరుసగా 12 నెలల పాటు ఇదే తరహా ఉష్ణోగ్రతలు నమోదై రికార్డు సృష్టించింది. చారిత్రకంగా ఆయా నెలలకు సంబంధించిన సరాసరి ఉష్ణోగ్రతల్లో రికార్డులు బద్దలయ్యాయి. గత ఏడాది జూన్ నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఏడాది మేలో ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాలను ప్రకృతి వైపరీత్యాలు వణికించాయి. కొన్ని చోట్ల తీవ్ర ఉష్ణ గాలుల ప్రభావం ఉంటే మరి కొన్ని చోట్ల వర్షాలు, వరదలు, తుపానులు ముంచెత్తాయి.

ఎల్‌నినోతోపాటు ప్రకృతికి మనుషులు చేసే చేటు వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నట్లు ఐరోపా వాతావరణ సంస్థ కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీసెస్ తెలిపింది. ఈ ఏడాది మేలో సరాసరి ఉష్ణోగ్రతలు పారిశ్రామికీకరణకు ముందు (1850-1900) నాటితో పోలిస్తే 1.52 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఇది చాలా కాలం పాటు కొనసాగితేనే పారిస్ ఒప్పందంలో పేర్కొన్న 15 డిగ్రీల సెల్సియస్ పరిమితిని మించిపోయినట్లు భావిస్తారు. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది మే మధ్య 12 నెలలు సరాసరి భూ ఉష్ణోగ్రతలు సైతం రికార్డు స్థాయిలో పెరిగాయి.

పారిశ్రామికీకరణకు ముందు పోలిస్తే వచ్చే ఐదేళ్లలో ఏదో ఒక ఏడాది భూతాపంలో పెరుగుదల1.5 డిగ్రీల సెల్సియస్ దాటిపోవడానికి 80 శాతం మేర అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. 1901 నుంచి 2012 మధ్యనాటి సరాసరితో పోలిస్తే ఇది 11.75 డిగ్రీల సెల్సియస్ అధికం. పారిశ్రామికీకరణకు ముందునాటి కంటే ఇది 1.68 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువ. ఈ ఐదేళ్లలో ఒక్క 2022లో నమోదైన ఉష్ణోగ్రతల రికార్డు బద్దలు కావడానికి 8 శాతం అవకాశం ఉందని స్పష్టం చేసింది. తీవ్రమైన వడగాడ్పుల మధ్య దేశంలో మార్చి నుంచి మే వరకు దాదాపు 25 వేల వడదెబ్బ కేసులు, 56 మరణాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ డేటా ప్రకారం ఉత్తరప్రదేశ్, బీహార్, దిల్లీ నుంచి ఎలాంటి మరణాలు నమోదు కాలేదు. ప్రపంచవ్యాప్తంగా 174 సంవత్సరాల రికార్డు పరిశీలిస్తే 2023 రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరం. రానున్న రోజుల్లో భూతాపం మరింతగా పెరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రకృతిని కాపాడితే దాని ప్రభావం నుంచి కొంత మేరకైనా బయటపడే అవకాశం ఉందని తెలిపారు.

హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి

చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు దక్కాల్సిన విభజన చట్టం హామీలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం తదితర సమస్యల పరిష్కారానికిగాను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు చంద్రబాబుకు గురువారం ఆయన లేఖ రాశారు. ఎన్డీఏ కూటమిలో చంద్రబాబుకు సానుకూల వాతావరణం ఏర్పడిందని, దీంతో వాటన్నింటి కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి న్యాయం జరిగేందుకు నడుం బిగించాలని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకుగాను చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటుకానున్న నూతన ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. చంద్రబాబు కేంద్రంలోని ఎన్డీఏలోనూ కీలక భూమిక పోషిస్తున్నారని, బీజేపీకి సొంతంగా మెజార్టీ లేనందున ప్రధానంగా టీడీపీ, జేడీయూ పార్టీలపై ఆధారపడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. గతంలో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం చంద్రబాబు చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాల అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని తుంగలో తొక్కిందని, విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని వివరించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇవ్వలేదని, విశాఖ రైల్వేజోన్ ప్రకటించి చేతులు దులుపుకుందని రామకృష్ణ విమర్శించారు. నాలుగుసార్లు శంకుస్థాపన జరిగినప్పటికీ కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాలేదన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం ఊసే లేదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తగిన నిధులు కేటాయించకపోగా, నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శించిందని తెలిపారు. దీనికి తోడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఆస్తుల విభజన పరిష్కారం కాలేదని, కేంద్ర బడ్జెట్‌లోను రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించకుండా ఏపీకి మొండిచేయి చూపిందని వివరించారు. ఆంధ్రుల హక్కుగా భాసిల్లుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగ నమ్మేందుకు మోదీ సర్కారు సిద్ధమైందని మండిపడ్డారు. ఎన్డీఏలో కీలకంగా వ్యవహరించనున్న చంద్రబాబుకు మరో అవకాశం లభించిందని, ఈ తరుణంలో ఏపీకి న్యాయం చేయడం కోసం అన్ని అవకాశాలు ఉపయోగించుకోవాలని చంద్రబాబుకు సూచించారు. కేంద్రంపై చంద్రబాబు చేసే ఒత్తిడికి రాష్ట్రంలోనే అన్ని రాజకీయ పార్టీలు సహకరించాల్సిన అవసరముందన్నారు. దీనికి సీపీఐ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

కంగనకు చెంపదెబ్బ

చండీగఢ్: బాలీవుడ్ నటి, లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన కంగనా రనౌత్‌కు చేదు అనుభవం ఎదురైంది. చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఆమెను చెంపదెబ్బ కొట్టారు. ఈ షాకింగ్ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దిల్లీకి గురువారం మధ్యాహ్నం బయల్దేరిన కంగన... విమానం ఎక్కేందుకు చండీగఢ్ విమానాశ్రయంలో బోర్డింగ్ పాయింట్‌కు వెళ్తుండగా ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సాగు చట్టాల్ని నిరసిస్తూ దిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేపట్టిన రైతులను అగౌరవపరిచేలా చేసిన వ్యాఖ్యలే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. కంగన ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండి సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే.

నేను క్షేమంగానే ఉన్నా...

ఈ ఘటనపై కంగన స్పందించారు. తాను బాగానే ఉన్నట్లు పేర్కొంటూ ఓ వీడియోను విడుదల చేశారు. సెక్యూరిటీ చెకింగ్ వద్ద ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. సెక్యూరిటీ చెకింగ్ పూర్తయి పాస్ కోసం వేచి చూస్తుండగా... సెక్యూరిటీ మహిళా ఆఫీసర్ తన వైపు వచ్చి కొట్టడంతో పాటు తనను దూషించారన్నారు. ఇందుకిలా చేశావని అడగ్గా... రైతులకు మద్దతుదారు అని ఆమె చెప్పినట్లు కంగన తెలిపారు. తాను క్షేమంగానే ఉన్నానని, కాకపోతే పంజాబ్‌లో ఉగ్రవాదం, హింసను ఎలా ఎదర్కోవాలనే అంశంపైనే ఆందోళనగా ఉందన్నారు. మరోవైపు, దిల్లీ చేరుకున్న అనంతరం కంగన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ అధికారులను కలిసి ఈ ఘటన గురించి వివరించారు. దీనిపై దర్యాప్తు చేసేందుకు బృందాన్ని ఏర్పాటు చేసిన అధికారులు.. కుల్వీందర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించేందుకు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆమెను సస్పెండ్ చేశారు.

ఒడిశా సీఎం ఎవరు?

- దిల్లీ వేదికగా చర్చోపచర్చలు
- రెండు రోజుల్లో ప్రకటనకు అవకాశం

భువనేశ్వర్: రెండు దశాబ్దాలకుపైగా సాగిన బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పాలనకు ముగింపు పలుకుతూ ఒడిశాలో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. దీంతో రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై బీజేపీ వర్గాల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. బీజేపీ ఒడిశా నేతలంతా దిల్లీలో పార్టీ పెద్దలతో సమావేశమవుతున్నారు. ఇప్పటికే కాబోయే సీఎం అంటూ ఆరుగురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. పార్టీ సీనియర్లు ధర్మేంద్ర ప్రధాన్, బైజయంత్ జయ్ పాండా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ పదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉన్నారు. సంభల్‌పూర్ ఎంపీ, కర్నాటక, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాలకు బీజేపీ ఇన్‌చార్జిగానూ బాధ్యతలు చేపట్టారు. పరిపాలనాపరమైన అనుభవం కూడా ఉంది. మరోవైపు పాండా... కేంద్రపారా ఎంపీ. ఇక గిరిజన నేతలు జుయల్ ఓరం, జీసీ ముర్ము, బాలాసోర్ ఎంపీ ప్రతాప్ సారంగి, నాలుగుసార్లు ఎమ్మెల్యే మోహన్ మాంఝీ పేర్లు వినిపిస్తున్నాయి. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు మెజారిటీ రాక మిత్రపక్షాలపై ఆధారపడుతున్న బీజేపీ... తమ ఎంపీల్లో ఒకరిని ఒడిశాకు ముఖ్యమంత్రి చేయగలదా అన్న చర్చ సాగుతోంది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం దిల్లీకి చేరుకొని ఈ చిక్కు ప్రశ్నకు సమాధానాన్ని అన్వేషిస్తోంది. దీనిపై ఒకటి లేక రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటే గనుక ఈనెల 10న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం జరుగుతుందని సమాచారం.

తొలిసారి లోక్‌సభకు 280 మంది

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి.. 18వ లోక్‌సభ కొలువుదీర బోతోంది. కొత్త ఎంపీల్లో 280 మంది మొదటిసారి పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఇలాంటి వారి సంఖ్య పెరిగింది. 2019లో 267 మంది మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభకు 53 మంది మంత్రులు పోటీ చేయగా వారిలో 35 మంది విజయం సాధించారు. దిగువసభకు తిరిగి ఎన్నికైన ఎంపీల్లో ఎనిమిది మంది తమ నియోజకవర్గాలను మార్చుకోగా, ఒకరు మాత్రం రెండు స్థానాల్లో గెలిచారు. 16 మంది రాజ్యసభ సభ్యులు కాగా మరొకరు ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి ఎన్నికైన తొమ్మిది మంది ఎంపీలు పార్టీలు మార్చుకోగా, మరో ఎనిమిది మంది చీలిన పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ వెల్లడించింది.

టెన్త్ కూడా చదవని 105 మంది ఎంపీలు

లోక్‌సభకు ఎన్నికైన 19శాతం మంది పదవ తరగతి ఉత్తీర్ణత సాధించ లేదని 'ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం' (ఏడీఆర్) తెలిపింది. అంటే 105 మంది ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వారు 18వ లోక్‌సభకు ఎన్నికైనట్లు పేర్కొంది. ఈసారి ఎన్నికైన వారిలో 77శాతం అంటే 420 మంది గ్రాడ్యుయేట్లు లేక అంతకంటే ఎక్కువ చదువుకున్న వారున్నట్లు నివేదించింది. 18వ లోక్‌సభకు 8,390 మంది పోటీ చేయగా వారిలో 121 మంది నిరక్షరాస్యులు, 359 మంది ఐదో తరగతి వరకే చదివిన అభ్యర్థులు ఉన్నారు. నిరక్షరాస్యులుగా ప్రకటించుకున్న 121 మంది ఓటమి పాలయ్యారు. విజేతల్లో ఇద్దరు ఐదవ తరగతి వరకు చదువుకోగా, మరో నలుగురు ఎనిమిదో తరగతి వరకు, 34 మంది టెన్త్, 65 మంది ఇంటర్ చదివిన వారున్నారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ (పీఆర్ఎస్) ప్రకారం చత్తీస్‌గఢ్‌లోని 91శాతం మంది, మధ్యప్రదేశ్‌లో 72 శాతం మంది, గుజరాత్‌లో 65 శాతం మంది ఎంపీలు వ్యవసాయమే తమ వృత్తిగా ప్రకటించారు. కొత్త ఎంపీల్లో ఏడు శాతం మంది న్యాయవాదులు, నాలుగు శాతం మంది వైద్యులు, ముగ్గురు మహిళలు సహా ఐదు శాతం మంది ఎంపీలకు డాక్టరేట్ డిగ్రీలు ఉన్నట్లు పీఆర్ఎస్ తెలిపింది.

93శాతం మంది సంపన్నులు

కొత్త ఎంపీల్లో 93 శాతం అంటే 504 మంది సంపన్నులు ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపీలు ఈ జాబితాలో టాప్‌లో నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు స్థానం నుంచి ఎన్నికైన టీడీపీ ఎంపీ చంద్రశేఖర్ పెమ్మసాని ఆస్తుల విలువ రూ.5,705 కోట్లుగా ఉంది. తెలంగాణలోని చేవెళ్ల నుంచి గెలిచిన బీజేపీ నేత కొండా విశ్వేశ్వరరెడ్డికి రూ.4,568 కోట్లు విలువ చేసే ఆస్తి ఉన్నది. ఇక మూడవ స్థానంలో నవీన్ జిందాల్ (బీజేపీ) నిలిచారు. ఈయన ఆస్తి విలువ రూ.1,241 కోట్లు కాగా హర్యానాలోని కురుక్షేత్ర స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019లో 475 మంది కోటీశ్వరులు ఉండగా 2014లో ఈ సంఖ్య 443గా ఉంది. 2009 నుంచి మిలియనీర్ల సంఖ్య పెరిగింది. అప్పట్లో 58 శాతం (315) మంది సంపన్నులు ఎన్నికయ్యారు. బీజేపీ నుంచి గెలుపొందిన 240 మంది ఎంపీల్లో 227 మంది అంటే 95 శాతం మంది ఆస్తిపరులే కాగా 99 మంది కాంగ్రెస్ ఎంపీల్లో 92 మందితో పాటు మిగతా పార్టీల అభ్యర్థుల్లో 90 శాతానికిపైగా ధనవంతులున్నారు. ఆప్‌లో ముగ్గురు, జేడీయూలో 12 మంది, టీడీపీ నుంచి ఎన్నికైన 16 మంది ఎంపీలంతా సంపన్నులే ఉన్నారు. ఏడీఆర్ ప్రకారం 42శాతం మంది అభ్యర్థులకు రూ.10 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నాయి. 19 శాతం మందికి రూ.5-10 కోట్ల వరకు... 32 శాతం మందికి రూ.కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య విలువ చేసే ఆస్తి ఉన్నట్లు వెల్లడైంది. ఒక శాతం మందికి మాత్రమే రూ.20 లక్షల లోపు ఆస్తులు ఉన్నాయని తేలింది.

మోదీజీ... నిరంకుశ చర్యలొద్దు

గాంధీ, అంబేద్కర్ విగ్రహాల తొలగింపుపై వినయ్ విశ్వం లేఖ



న్యూదిల్లీ: పార్లమెంటు ఆవరణలోని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను తొలగించడం ఆక్షేపణీయమని, ఇటువంటి నిరంకుశ, ఏకపక్ష నిర్ణయాలు, చర్యలను మానుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం సూచించారు. పార్లమెంటు ఆవరణలోని మహనీయుల విగ్రహాలను వాటి స్థానం నుంచి తొలగించి వేరొక చోటుకు మార్చే ప్రయత్నాలను తక్షణమే ఆపేయాలని కోరుతూ ఒక లేఖ పంపారు. అవి విగ్రహాలు కాదు దేశ స్వాతంత్ర్య సమరానికి, సమానత్వ పోరాటానికి, దేశ నిర్మాణానికి అందించిన తోడ్పాటునకు చిహ్నాలు అని విశ్వం పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావడం, రాజ్యాంగం అమలు కావడం, బ్యాంకుల జాతీయీకరణ, పంచాయతీ రాజ్ వ్యవస్థ స్థాపన వంటి చారిత్రక ఘట్టాలకు సజీవసాక్షిగా పార్లమెంటు పాత భవనమున్నదన్నారు. 'పార్లమెంటును కొత్త భవనానికి మార్చి... పాత భవనాన్ని ప్రదర్శనశాల (మ్యూజియం)గా మార్చారు. ఇప్పుడేమో సమ్మిళిత వారసత్వంపై దాడులకు ఉపకరిస్తున్నారు. పార్లమెంటు ఆవరణలోని మహనీయుల విగ్రహాల తొలగింపునకు పూనుకుంటున్నారు. పార్లమెంటు భవన ఆవరణలో 50కుపైగా విగ్రహాలను అకారణంగా నేర్పాటు చేయలేదు. అవన్నీ దేశ చరిత్రకు ప్రతిరూపాలు. దేశానికి చేసిన సేవకుగాను వారిని ఈ విధంగా సన్మానించారు. కమ్యూనిస్టులు ఎస్ఏ డాంగే, భూపేశ్ గుప్తా, ఏకే గోపాలన్, ఇంద్రజీత్ గుప్తా వంటి అనేక మందికి ఇలాంటి గౌరవం లభించింది. డాంగే, గుప్తా వంటి వారు కమ్యూనిస్టులు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు. బహుశ ఇందుకోసమే ఆర్ఎస్ఎస్ నియంత్రణలోని మీ ప్రభుత్వం వారి వారసత్వాన్ని తుడిచిపెట్టాలని చూస్తోంది' అని మోదీకి రాసిన లేఖలో విశ్వం పేర్కొన్నారు. దశాబ్దంగా గాంధీ, అంబేద్కర్‌ను గౌరవించనందుకే మీ పార్టీని దేశ ప్రజలు తిరస్కరించారని తాజా ఎన్నికల ఫలితాలనుద్దేశించి వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు. దేశ చరిత్రను తిరగరాసేందుకు మతతత్వశక్తులు అనేక విఫల ప్రయత్నాలు చేశాయని, ఇప్పుడు కూడా అందుకు యత్నిస్తుండటం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ మహనీయులు దేశ ప్రజల గుండెల్లో జీవిస్తారని మరువద్దని, వారిని అవమానిస్తే ప్రజలు సహించబోరని ప్రధానికి వినయ్ విశ్వం సూచించారు. దేశ చరిత్రతో ఆటలు వద్దని హితవు పలికారు. మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీ వంటి మహనీయుల విగ్రహాల తొలగింపు, స్థానం మార్చడం వంటివి చేయొద్దని తన లేఖ ద్వారా కోరారు.

అగ్నివీర్, యూసీసీపై జేడీయూ మెలిక

'మోదీ 3.0' ఏర్పాటుకు ముందు ఎన్డీఏలో కలకలం

న్యూదిల్లీ: ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్న వేళ అగ్నివీర్, యూసీసీ పథకాలపై ఎన్డీఏ కీలక భాగస్వామ్య పక్షం జేడీయూ అభ్యంతరాలు వ్యక్తం చేయడం రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది. మోదీ 3.0 ప్రభుత్వం ఏర్పడకముందే బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన అతి పెద్ద డిమాండ్లను బీజేపీ అధిష్ఠానం ముందుంచారు. నితీశ్‌తో పాటు మరో భాగస్వామి చిరాగ్ పాశ్వాన్ కూడా అగ్నివీర్‌పై సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సైన్యంలో నియామకాలకు సంబంధించి మోదీ 2.0 ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నివీర్ పథకం అమలును కొత్త కోణంలో ఆలోచించాలని, మార్పులు చేయాల్సిందిగా సూచించినట్లు సమాచారం. అంతే కాకుండా ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) సంక్లిష్టమైన అంశమని, అందువల్ల దీనిపై ప్రజలతో సమగ్ర చర్చ జరగాలని జేడీయూ విశ్వసిస్తోంది. అయితే ఒకే దేశం, ఒకే ఎన్నిక (జమిలీ)పై ప్రభుత్వానికి జేడీయూ మద్దతు తెలిపింది. నిజానికి యూసీసీ విషయంలో మొదటి నుంచీ అన్ని రాజకీయ పార్టీల మధ్య ప్రతిష్ఠంభన నెలకొంది. ఈ సమస్యపై ప్రతి ఒక్కరికీ సొంత అభిప్రాయం ఉంది. దేశంలో దీన్ని అమలు చేయాలని కొన్ని పార్టీలు కోరుతుండగా... చాలా పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. అగ్నివీర్ విషయంలోనూ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీనిని చాలా రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి. ఈ రెండింటి విషయంలో బీజేపీ ఒక్కటే మొండిగా ఉంది. జమిలి విషయంలో నితీశ్ మెతక వైఖరి ప్రదర్శించి... దానికి సమ్మతించారు. ఇంతేకాకుండా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు నితీశ్ మరికొన్ని డిమాండ్లను మోదీ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వంలో మూడు పెద్ద మంత్రిత్వ శాఖలు కోరుకుంటున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. రైల్వేతో పాటు వ్యవసాయ మంత్రిత్వ శాఖలు కోరుతున్నట్లు సమాచారం. బీహార్‌కు ప్రత్యేక హోదా, దేశవ్యాప్త కులగణన వంటి అంశాలను జేడీయూ తెరపైకి తెస్తోంది. కాగా కేంద్రంలో మోదీ 3.0 సర్కారు ఏర్పాటుకు తమ మద్దతు కీలకమైన నేపథ్యంలో జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సైనిక నియామకాల కోసం మోదీ సర్కార్ తీసుకొచ్చిన అగ్నివీర్ పథకంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పథకంపై ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ప్రజలు లేవనెత్తిన లోటుపాట్లను వివరంగా చర్చించి వాటిని చక్కదిద్దాలని తమ పార్టీ కోరుకుంటోందని చెప్పారు. త్యాగి చేసిన వ్యాఖ్యల వీడియో జాతీయ మీడియాలో వైరల్ అయింది. ఉమ్మడి పౌరస్మృతిపై పార్టీ అధ్యక్షుడి హోదాలో నితీశ్‌కుమార్ లా కమిషన్ ఛైర్మన్‌కు లేఖ రాశారని ఆయన గుర్తుచేశారు. తాము ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకం కానప్పటికీ... దీనివల్ల ప్రభావితమయ్యే అన్ని వర్గాల ప్రజలతో చర్చించి ఓ పరిష్కారం అన్వేషించాలని త్యాగి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అగ్నివీర్ పథకంపై కత్తి తిప్పడంలో సమయాన్ని వృథా చేయలేదు. 'ఇప్పుడు 'అగ్నిపరీక్ష' జరుగుతోంది. ఎందుకంటే కొందరు దీనిని (అగ్నివీర్ పథకం) సమీక్షించాలని అంటున్నారు. యూపీలో కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం కలిగించినందున దీనిని సమీక్షించాలని నేను చెబుతాను' అని కాంగ్రెస్ మాజీ నేత, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ పేర్కొన్నట్లు పీటీఐ వెల్లడించింది. జూన్ 2022లో మోదీ 2.0 ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించింది. దీని ప్రకారం నాలుగేళ్లపాటు సాయుధ దళాల్లో వివిధ పోస్టులకు నియామకాలు జరుగుతాయి. నాలుగేళ్ల తర్వాత ఒక్కో బ్యాచ్‌లోని అగ్నివీరులలో కేవలం 25 శాతం మంది మాత్రమే మరో 15ఏళ్ల పాటు విధుల్లో కొనసాగుతారు. మిగతావారు ఉద్యోగాలు వదిలేయాలి. రక్షణ వ్యయాన్ని తగ్గించుకునేందుకు మోదీ సర్కారు ఈ పథకాన్ని తెచ్చింది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర ఆందోళనలు చెలరేగాయి. ఎన్నికల ముందు ఓ సందర్భంలో రాజ్‌నాథ్ సింగ్ కూడా అగ్నిపథ్ నియామక పథకంలో అవసరమైతే మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. నిరుద్యోగ యువతకు అన్యాయం చేసే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేసి...16 ఏళ్ల సర్వీసు ఉన్న పాత రిక్రూట్‌మెంట్ పథకం తిరిగి అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపింది. కొత్త పథకాన్ని ఆర్మీ చీఫ్‌లు ఆమోదించలేదని రాహుల్ గాంధీ బహిరంగంగానే ప్రకటించారు. పెన్షన్ ఖర్చులు తగ్గించాలని సైన్యంపై ఒత్తిడి తెచ్చారని రాహుల్ ఆరోపించారు.

ఏపీకి హోదా హామీ మోదీ నెరవేరుస్తారా? కాంగ్రెస్

న్యూదిల్లీ: ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు ప్రత్యేక హోదా ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని ప్రధాన మంత్రి నెరవేరుస్తారా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. మరోవైపు మోదీ 3.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని పదే పదే ప్రచారం జరుగుతోందని, కానీ, ఈసారి అది మోదీ 1/3 ప్రభుత్వమేనని విమర్శించింది. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్... ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు సంబంధించి నాలుగు ప్రశ్నలు సంధిస్తూ 'ఎక్స్'లో ఓ వీడియో పోస్టు చేశారు. 'ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని ఏప్రిల్ 30, 2014న తిరుపతి వేదికగా హామీ ఇచ్చారు. తద్వారా భారీస్థాయిలో పెట్టుబడులు వస్తాయని చెప్పారు. ఇప్పటికి పదేళ్లయింది.. కానీ, అది జరగలేదు. ఇప్పుడు ఆ హామీ నెరవేరుతుందా... ఏపీకి ప్రధానమంత్రి ప్రత్యేక హోదా కల్పిస్తారా' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించిన ఆయన... దీన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాయన్నారు. ఇప్పుడైనా ఆ ప్రైవేటీకరణను అడ్డుకుంటారా అని నిలదీశారు. ఎన్డీయే కూటమిలో ఉన్న నీతీశ్‌కుమార్ ఎంతోకాలంగా డిమాండు చేస్తున్నట్లుగా... బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తారా... ఈ డిమాండు కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ ప్రధాని మాత్రం మౌనం వీడటం లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూలతో కొనసాగిన మహాగఠ్‌బంధన్ హయాంలో రాష్ట్రంలో కులగణన చేపట్టామన్నారు. దీనిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని, నీతీశ్ కూడా ఇందుకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఇలా దేశం మొత్తం కులగణన చేపడతామని ప్రధాని హామీ ఇస్తారా అని కాంగ్రెస్ సీనియర్ నేత అడిగారు. ఇదిలాఉంటే, ఎన్డీఏ కూటమిలో ఉన్న టీడీపీ 16, జేడీయూ 12 లోక్‌సభ సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే. బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు అవసరమైన మెజార్టీని సొంతంగా సాధించలేకపోయింది.

20 మంది బీజేపీ మంత్రులు చిత్తు

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ఘోర పరాభవం

న్యూదిల్లీ: తమ పదేళ్ల పాలనతో మెచ్చి మూడవసారి అధికారాన్ని దేశ ప్రజలు కట్టబెట్టారన్న ప్రధాని మోదీ మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. తాము చేసిన పని వల్ల గెలిచామని మోదీ అంటుండటాన్ని బట్టి ఆ పార్టీకి చెందిన కేంద్రమంత్రులకు వారి నియోజకవర్గాల్లో ఆదరణ ఉండాలి కానీ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వేరొక కథ చెబుతున్నాయి. 20 మంది కేంద్ర మంత్రులు ఘోర పరాభవాన్ని చవి చూశారు. వీరిలో ప్రముఖంగా రాజీవ్ చంద్రశేఖర్, స్మృతీ ఇరానీ, అజయ్ కుమార్ మిశ్రా, అర్జున్ ముండా, వి.మురళీధరన్, సాధ్వీ నిరంజన్ జ్యోతి వంటివారున్నారు.

ఓడిన మంత్రులు వీరే...

కేంద్ర జలశక్తి మంత్రిగా, నైపుణ్యాభివృద్ధి, ఎంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రిగా ఉన్న రాజీవ్ చంద్రశేఖర్ కేరళలోని తిరువనంతపురం నుంచి కాంగ్రెస్ నేత శశిథరూర్‌పై పోటీ చేసి 16,077ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర మహిళ, శిశు సంక్షేమ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతీ ఇరానీ ఉత్తరప్రదేశ్‌లోని అమేథి నుంచి కాంగ్రెస్ నేత కిశోరీ లాల్ శర్మపై పోటీ చేసి 1,67,196 ఓట్ల తేడాతో చిత్తయ్యారు. కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా లఖింపూర్ ఖేరీలో 34,329 ఓట్లతో సమాజ్‌వాదీ పార్టీ నేత ఉత్కర్ష్ వర్మ మధుర్ గెలిచారు. కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాశ్ సర్కార్ బెంగాల్‌లోని బంకురా స్థానం నుంచి పోటీ చేసి 32,778 ఓట్లతో తృణమూల్ నేత అనూప్ చక్రవర్తి చేతిలో ఓడిపోయారు. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా జార్ఖండ్‌లోని కుంతి స్థానం నుంచి కాంగ్రెస్ నేత కాళిచరణ్ ముండాపై పోటీ చేసి 1,49,675 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి కైలాశ్ చౌదరి రాజస్థాన్‌లోని బర్మర్ స్థానం నుంచి మూడవసారి పోటీ చేసి చిత్తయ్యారు. 4,17,943 ఓట్లతో కాంగ్రెస్ నేత ఉమేదా రామ్ బనివాల్ చేతిలో ఘోర పరాభవాన్ని చవి చూశారు. కేంద్ర సమాచారం, ప్రసారాల శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తమిళనాడులోని నీల్గిరీస్ (ఎస్సీ రిజర్వ్‌డ్) స్థానం నుంచి డీఎంకే నేత ఎ.రాజాపై పోటీ చేసి 2,40,585 ఓట్లతో ఓటమి పాలయ్యారు. కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మాజీ సహాయ మంత్రి నితీశ్ ప్రమాణిక్ బెంగాల్‌లోని కూచ్‌బెహార్ స్థానం నుంచి టీఎంసీ నేత జగదీశ్ చంద్ర బర్మ బసునియాపై పోటీ చేసి 39,250 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర మత్స్య, పశు సంవర్ధన, డైరీ శాఖ సహాయ మంత్రి సంజీవ్ బల్యాన్ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ నేత హరేంద్ర సింగ్ మలిక్‌పై పోటీ చేసి 24,672 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మాజీ సహాయ మంత్రి కపిల్ పాటిల్ మహారాష్ట్రలోని భివండి నుంచి ఎన్సీపీ (ఎస్పీ) నేత సురేశ్ గోపీనాథ్ మాత్రేపై పోటీ చేసి 66,121 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రావ్‌సాహెబ్ దాన్వే మహారాష్ట్రలోని జల్నా స్థానం నుంచి కాంగ్రెస్ నేత కల్యాణ్ వైజినాథ్‌రావ్ కాలేపై పోటీ చేసి 1,09,958 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి భారతీ పవార్ మహారాష్ట్రలోని దిండోరి (ఎస్టీ రిజర్వ్‌డ్) స్థానం నుంచి ఎన్సీపీ (ఎస్పీ) నేత భాస్కర్ మురళీధర్ భగారేపై పోటీ చేసి 1,13,199 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోరి ఉత్తరప్రదేశ్‌లోని మోహన్‌లాల్ గంజ్ (ఎస్సీ రిజర్వ్‌డ్) స్థానం నుంచి ఎస్పీ నేత ఆర్‌కే చౌదరిపై పోటీ చేసి 70,292 ఓట్లతో ఓటమిని చవిచూశారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖూబా కర్నాటకలోని బీదర్ నుంచి కాంగ్రెస్ నేత సాగర్ ఈశ్వర్ ఖండ్రే చేతిలో 1,28,875 ఓట్లతో చిత్తయ్యారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ కేరళలోని అట్టింగల్ నుంచి కాంగ్రెస్ నేత అదూర్ రపకాశ్‌పై పోటీ చేసి 16,272 ఓట్లతో ఓడిపోయారు. మూడవ స్థానానికి పరిమితమయ్యారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ నుంచి ఎస్పీ నేత వీరేంద్ర సింగ్‌పై పోటీ చేసి 21,565 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర స్టీల్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి ఉత్తరప్రదేశ్‌లోని ఫత్తేపూర్ నుంచి ఎస్పీ నేత నరేశ్ ఉత్తమ్ పటేల్‌పై పోటీ చేసి 33,199 ఓట్లతో చిత్తయ్యారు. కేంద్ర ఎంఎస్ఎంఈల శాఖ సహాయ మంత్రి భానుప్రతాప్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ (ఎస్సీ రిజర్వ్‌డ్) స్థానం నుంచి ఎస్పీ నేత నారాయణ్ దాస్ అర్హివాల్‌పై పోటీ చేసి 53,898 ఓట్లతో ఓటమిని చవిచూశారు. కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధనం శాఖ మంత్రి రాజ్ కుమార్ సింగ్ బీహార్‌లోని అర్హా నుంచి సీపీఐ(ఎంఎల్) నేత సుదామా ప్రసాద్‌పై పోటీ చేసి 59,808 ఓట్లతో ఓడిపోయారు. కేంద్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ సహాయ మంత్రి దేవశ్రీ చౌదురి దక్షిణ కోల్‌కతా స్థానం నుంచి టీఎంసీ నేత మాలా రాయ్‌పై పోటీ చేసి 1,87,231 ఓట్లతో ఓడిపోయారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.